డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR

| తెలంగాణ Telangana | మంగళవారం Tuesday | 02 - 06 -2026 02- 06 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 138 Issue: 138 | పేజీలు : 12 Pages: 12 | వెల : 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|











డైనమిక్ జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR







| తెలంగాణ Telangana | మంగళవారం Tuesday | 02 - 06 -2026 02- 06 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక: 138 Issue: 138 | పేజీలు : 12 Pages: 12 | వెల : 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|




# ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



- రైతులకు సీఎం భరోసా.
- ధాన్యం కొనుగోలుపై స్పష్టత.
- తుమ్మిడిహెట్టిపై కేంద్రానికి విజ్ఞప్తి.

2

## జనసేన సభకు అనుమతి
# నిరాకరణ

- పోలీసుల నిర్ణయంపై చర్చ.
- హైకోర్టును ఆశ్రయించిన జనసేన.
- కోర్టు తీర్పుపై ఉత్కంఠ.



2

# బీజేపీ అధికారంలోకి రాదు

- మఖ్దూం భవన్‌లో కౌన్సిల్ సమావేశం.
- ప్రజా సమస్యలపై పోరాటాలకు పిలుపు.
- ఎన్నికలకు పార్టీ సన్నద్ధం.
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 01:**

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మతపరమైన విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. మతాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందంటూ ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని కూనంనేని అన్నారు. అయితే రాష్ట్రంలో కొన్ని స్థానాలు గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ప్రజలు ప్రస్తుతం అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దేశవ్యాప్తంగా ప్రభుత్వాలపై అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రత్యామ్నాయ రాజకీయాలకు బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పార్టీ వ్యూహాన్ని కూడా

- మిగతా 2 లో...

## తెలంగాణ అస్తిత్వ
# పరిరక్షణే లక్ష్యం

- ఉద్యమకారుల రౌండ్ టేబుల్.
- కవిత ఘాటు వ్యాఖ్యలు.
- హామీల అమలుపై డిమాండ్.

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 1:**

తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు సాధన అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు, అమరవీరుల కుటుంబ సభ్యుల సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసమే తమ పార్టీ పనిచేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన ప్రజా ఉద్యమంగా నిలిచిందని కవిత పేర్కొన్నారు. వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాల ద్వారా



- మిగతా 2 లో...



# గుడిసెలు లేని తెలంగాణ..
# ప్రభుత్వ సంకల్పం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.
- ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల.
- మంథనిలో గృహ ప్రవేశాలు.
- లబ్ధిదారుల్లో ఆనందం.



02

# ఖర్గేతో భట్టి భేటీ

- ఢిల్లీలో కీలక సమావేశం.
- జార్ఖండ్ రాజకీయాలపై చర్చ.
- రాజ్యసభ వ్యూహంపై సమీక్ష.



02

## డంపింగ్ యార్డుపై
# బీఆర్ఎస్ ఆందోళన

- సిద్దాపూర్‌లో పాదయాత్ర.
- ప్రభుత్వ నిర్ణయంపై నిరసన.
- ఉద్యమం చేస్తామని హెచ్చరిక.



02

# ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం

- ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు.
- రైతుల ఇబ్బందులపై ఆందోళన.
- తక్షణ కొనుగోళ్లకు డిమాండ్.

02



# బీజేపీ అధికారంలోకి రాదు



- మొదటిపేజీ తరువాయి...

ఆయన వివరించారు. పొత్తులు కుదిరితే కనీసం ఐదు స్థానాల్లో, పొత్తులు లేకపోతే కనీసం పదిహేను నియోజకవర్గాల్లో పోటీ చేసేలా పార్టీ సిద్ధం కావాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బలమైన నలభై నియోజకవర్గాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ నియోజకవర్గాల్లో ఆగస్టు 6 నుంచి 15 వరకు ప్రత్యేక పాదయాత్రలు నిర్వహించనున్నట్లు కూనంనేని ప్రకటించారు. ఈ యాత్రల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తామని చెప్పారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై జరుగుతున్న వేధింపులకు నిరసనగా జూన్ 4న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ అంశంపై జూన్ 15న రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సెప్టెంబర్ 28న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తామని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

# తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే లక్ష్యం

- మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ ఆకాంక్షలను ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. ఉద్యమ సమయంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించకుండా తమ హక్కుల కోసం పోరాటం చేశామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకులపై, అక్కడి రాజకీయ పరిణామాలపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు సహించరని స్పష్టం చేశారు. తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ ప్రజలతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, వారిని గౌరవిస్తామని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చలేదని కవిత విమర్శించారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి సంబంధించి రైతులు, యువత, సామాజిక న్యాయం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కవిత పేర్కొన్నారు. రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక తెలంగాణ నిర్మాణం తమ లక్ష్యాలని తెలిపారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిపై ప్రజలు, ఉద్యమకారులు సూచనలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# గుడిసెలు లేని తెలంగాణ..
# ప్రభుత్వ సంకల్పం

**జనం వాయిస్, మంథని, జూన్ 1:**

గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ ఆశయ సాధనలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన వెల్లడించారు. సోమవారం మంథని నియోజకవర్గంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త ఇళ్లలోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులను అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిజమైన అర్హులకు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాల కలలు నెరవేరడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని మంత్రి పేర్కొన్నారు. కొత్త ఇళ్లలోకి ప్రవేశిస్తున్న కుటుంబాల కళ్లల్లో కనిపించిన సంతోషం తనకు ప్రత్యేక సంతృప్తిని ఇచ్చిందన్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో గృహ నిర్మాణ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షితమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు స్థిరమైన నివాస వసతి అందుబాటులోకి వస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సొంతింటి కల సాకారం కావడం ప్రతి కుటుంబ జీవితంలో ఒక మధురమైన ఘట్టమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. గుడిసెలు లేని తెలంగాణ లక్ష్య సాధన దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



# ఖర్గేతో భట్టి భేటీ

**జనం వాయిస్, న్యూఢిల్లీ, జూన్ 01:**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జార్ఖండ్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు, రానున్న రాజ్యసభ ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇటీవల జార్ఖండ్‌లో చేపట్టిన పర్యటన వివరాలను భట్టి విక్రమార్క ఖర్గేకు వివరించారు. అక్కడి రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, కూటమి భాగస్వామ్య పక్షాలతో జరిగిన చర్చలపై సమగ్ర నివేదికను అందించినట్లు సమాచారం. త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో జరిగిన సమావేశం వివరాలను కూడా భట్టి విక్రమార్క వివరించారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కూటమి పార్టీల మధ్య ఐక్యతను పెంపొందించడం ద్వారా రాజ్యసభ ఎన్నికల్లో విజయాన్ని సాధించడమే ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇందుకోసం అన్ని స్థాయిల్లో సమన్వయ చర్యలు కొనసాగుతున్నాయని, కూటమి బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఖర్గేకు వివరించారు. జార్ఖండ్ కాంగ్రెస్ నాయకత్వం కూటమి భాగస్వామ్య పక్షాలతో కలిసి సమిష్టి కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ఎన్నికల వ్యూహాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో కూటమి ఐక్యతను కాపాడుతూ ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పార్టీ బలోపేతం, రాజకీయ సమన్వయం, ఎన్నికల విజయంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు సమాచారం.

# ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

**జనం వాయిస్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 01:**



రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తడిసిన ధాన్యానికి కూడా కనీస మద్దతు ధర అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి విమర్శించారు. కేవలం మద్దతు ధర ప్రకటించడం సరిపోదని, రాష్ట్రాల్లో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం కూడా కేంద్రం బాధ్యత అని అన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇచ్చే ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయనున్నామని తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, కొనుగోలు ప్రక్రియలో రెండు రోజులు ఆలస్యం జరిగినా ప్రతి గింజను కొనుగోలు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండిన మొక్కజొన్న, జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను కూడా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఏడాది కాలంగా చర్చలకు ప్రయత్నిస్తున్నప్పటికీ స్పందన రావడం లేదని అన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్రతో సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోందని సీఎం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మధ్యవర్తిత్వం వహించి పరిష్కారానికి దోహదపడాలని కోరారు. తెలంగాణ పట్ల వివక్ష కొనసాగితే తదుపరి కార్యాచరణను జూన్ 15 తర్వాత ప్రకటిస్తామని హెచ్చరించారు. సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని గూడాలు, తండాల్లో గుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యమని చెప్పారు. ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రెండో విడతగా మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జనసేన సభకు అనుమతి నిరాకరణ

**జనం వాయిస్, హైదరాబాద్, జూన్ 01:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన "తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ జనసేన సాధక్ సమ్మేళనం"కు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరించారు. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో జూన్ 2న ఈ సభను నిర్వహించాలని జనసేన పార్టీ ప్రణాళిక రూపొందించినప్పటికీ, శాంతిభద్రతల కారణాలను చూపుతూ పోలీసులు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో అధికారిక వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో భద్రతా బలగాలన్నీ ఆ విధుల్లో నిమగ్నమై ఉంటాయని పోలీసులు తెలిపారు. అదే రోజు రాజకీయ సభ నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యలతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో సభ నిర్వహణకు అనుమతి నిరాకరిస్తూ సంబంధిత అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు భద్రత కల్పించడం ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్య అంశమని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. పోలీసుల నిర్ణయంపై జనసేన పార్టీ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పార్టీ తరఫున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సభ నిర్వహణ తమ ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొంటూ అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరినట్లు తెలిసింది. ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. కొందరు రాజకీయ నాయకులు సభ నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, తెలంగాణలో పార్టీ విస్తరణలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని జనసేన వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పార్టీ కార్యకర్తలను సమీకరించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడమే లక్ష్యమని



పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కోర్టు తీర్పు అనంతరం సభ నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# డంపింగ్ యార్డుపై బీఆర్ఎస్ ఆందోళన

**జనం వాయిస్, రంగారెడ్డి, జూన్ 01:**

సిద్ధాపూర్ ప్రాంతంలో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంతో పాటు గ్రామంలో పాదయాత్ర చేపట్టి స్థానిక ప్రజల అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. సిద్ధాపూర్ గ్రామంలో నిర్వహించిన పాదయాత్రను సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన నాయకులు డంపింగ్ యార్డు ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమాచార సాంకేతిక రంగ అభివృద్ధి కోసం కేటాయించిన భూముల్లో ప్రస్తుతం చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం విచారకరమన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని విమర్శించారు. స్థానిక ప్రజలు ఈ నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరని నాయకులు స్పష్టం చేశారు. డంపింగ్ యార్డు వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పచ్చదనాన్ని కాపాడాలని, ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం సమంజసం కాదన్నారు. ప్రజల భావోద్వేగాలను గౌరవించి డంపింగ్ యార్డు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే స్థానిక ప్రజలతో కలిసి మరింత విస్తృత స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని




బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం



**జనం వాయిస్, న్యూఢిల్లీ, జూన్ 01:**

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఢిల్లీలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల ప్రయోజనాలను విస్మరించిందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని రాంచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైనే ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దిగుబడులకు సంబంధించిన సరైన గణాంకాలను కేంద్రానికి పంపడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిధులు తిరిగి చెల్లిస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై బీజేపీ ఇప్పటికే పలు ఆందోళనలు నిర్వహించిందని రాంచందర్ రావు గుర్తుచేశారు. బీజేపీ నిరంతర పోరాటాలు, నిరసనల కారణంగానే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాల్సి వచ్చిందని అన్నారు. ప్రతిపక్ష ఒత్తిడి వల్లే ప్రభుత్వం స్పందించిందని వ్యాఖ్యానించారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ప్రతి ధాన్యం గింజను ఎలాంటి జాప్యం లేకుండా యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కొనుగోలు, రవాణా, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జూన్ 2న ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాంచందర్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ నాయకత్వంతో పాటు పలువురు కేంద్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

RNI NO:TGTEL/26/A0383
దినమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# సంపాదకీయం

## అడుగంటుతున్న జీవజలం

నీటిపై పెరుగుతున్న ఒత్తిడి.

ప్రకృతి ఇచ్చిన హెచ్చరిక.

సంరక్షణే శాశ్వత పరిష్కారం.

**జనం వాయిస్, డెస్క్, జూన్ 01:**
భూమిపై జీవం మనుగడకు అత్యంత అవసరమైన సహజ వనరు నీరు. అయితే నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నీటి కొరత మానవాళికి పెద్ద సవాలుగా మారుతోంది. ముఖ్యంగా భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. ఒకప్పుడు గ్రామాల్లో కొన్ని అడుగుల లోతులో లభించిన నీరు ఇప్పుడు వందల అడుగుల లోతులో కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ఇది కేవలం ఒక ప్రాంతం సమస్య కాదు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ప్రమాదకర సంకేతం. భవిష్యత్తు తరాలకు నీటిని అందించాలంటే నేటి తరం తీసుకునే నిర్ణయాలే కీలకం. ప్రకృతి ప్రతి ఏడాది వర్షాల రూపంలో అపారమైన నీటిని అందిస్తోంది. కానీ ఆ నీటిని నిల్వ చేసుకోవడంలో మనం ఘోరంగా విఫలమవుతున్నాం. వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గాలను మనమే మూసివేస్తున్నాం. చెరువులు కనుమరుగవుతున్నాయి. కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయి. పొలాలు, ఖాళీ స్థలాలు కాంక్రీటు నిర్మాణాలుగా మారిపోతున్నాయి. ఫలితంగా వర్షపు నీరు భూమిలోకి చేరకుండా నేరుగా కాలువల్లోకి వెళ్లి సముద్రంలో కలిసిపోతోంది. ప్రకృతి ప్రసాదించిన నీటిని కాపాడుకోవాల్సిన చోట మనమే దానిని వృథా చేస్తున్నాం.

వ్యవసాయ రంగం భూగర్భ జలాలపై అత్యధికంగా ఆధారపడుతోంది. పంటలకు అవసరమైన నీటి కోసం రైతులు వరుసగా బోర్లు వేస్తున్నారు. ఒక బోరు ఎండిపోతే మరొకటి, అది కూడా ఎండిపోతే ఇంకొకటి అనే పరిస్థితి ఏర్పడింది. ఈ విధానం తాత్కాలికంగా సమస్యను పరిష్కరించినా, దీర్ఘకాలంలో భూగర్భ జలాల నిల్వలను పూర్తిగా ఖాళీ చేస్తోంది. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపిక జరగకపోవడం కూడా పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. ప్రకృతితో పోటీ పడే ప్రయత్నం ఎప్పటికీ విజయవంతం కాదనే విషయాన్ని మనం గుర్తించాలి. పట్టణాల్లో కూడా పరిస్థితి భిన్నంగా లేదు. అపార్ట్‌మెంట్లు, భారీ భవనాలు, రహదారులు పెరుగుతున్న కొద్దీ భూమి సహజ స్వరూపం కోల్పోతోంది. వర్షపు నీటిని భూమిలోకి పంపే వ్యవస్థలు లేకపోవడంతో నీటి మట్టం వేగంగా పడిపోతోంది. ఒకవైపు ప్రతి ఇంటికి, ప్రతి కార్యాలయానికి నీటి అవసరాలు పెరుగుతుంటే



మరోవైపు నీటి వనరులు క్షీణిస్తున్నాయి. భూగర్భ జలాలను అవసరానికి మించి వినియోగిస్తూ వాటి పునరుద్ధరణ గురించి పట్టించుకోకపోవడం భవిష్యత్తుకు ప్రమాదకర సంకేతంగా మారింది.

వాతావరణ మార్పులు కూడా ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గతంలో మాదిరిగా సకాలంలో వర్షాలు కురవడం లేదు. ఎండలు పెరుగుతున్నాయి. భూమి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరదలు, మరికొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ మార్పులన్నీ భూగర్భ జలాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే దాని ప్రభావం మొదటగా నీటి వనరులపైనే కనిపిస్తుందనే విషయం ఇప్పుడు స్పష్టమవుతోంది. భూగర్భ జలాల తగ్గుదల వల్ల కేవలం నీటి సమస్య మాత్రమే కాదు, ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. వ్యవసాయం బలహీనపడుతుంది. తాగునీటి కొరత పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు అధికమవుతాయి. పరిశ్రమలపై ప్రభావం పడుతుంది. చివరకు నీరు ఒక విలువైన వస్తువుగా మారి సామాన్య ప్రజలకు అందని పరిస్థితి రావచ్చు. నేటి నిర్లక్ష్యం రేపటి సంక్షోభానికి కారణమవుతుందనే విషయాన్ని పాలకులు, ప్రజలు సమానంగా గుర్తించాల్సిన అవసరం ఉంది.

ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే నీటి సంరక్షణను ఉద్యమంగా మార్చాలి. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించాలి. నీటి వృథాను అరికట్టాలి. పాఠశాల స్థాయి నుంచే నీటి విలువపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వ విధానాలు మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత అవసరం. ప్రతి చుక్క నీటిని భవిష్యత్తు సంపదగా భావించే దృక్పథం ఏర్పడాలి. భూగర్భ జలాలు ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన ఆస్తి. వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేస్తే చివరికి నష్టపోయేది మనమే. అందుకే భూగర్భ జలాల సంరక్షణను ప్రభుత్వాల బాధ్యతగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి కర్తవ్యంగా భావించాలి. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే. నేడు తీసుకునే జాగ్రత్తలే రేపటి తరాలకు జీవనాధారంగా నిలుస్తాయి.

## జూన్ 2 జనగర్జన ఫలం

----------------------------------

మంజుల పత్తిపాటి
9347042218

కేసీఆర్ పిలుపు ప్రతి గుండెల్లో మంటలు రేపింది..!
తెలంగాణ సాధన పల్లె పల్లెకి విస్తరించింది..!

ఒక్కో అమరవీరుని కల ప్రజల జెండా అయి నిలిచింది..!
జై తెలంగాణ నినాదంతో ఢిల్లీ గద్దె కంపించింది..!

మిలియన్ మార్చ్ అడుగులతో ఢిల్లీ గోడలు కంపించాయి..!
ట్యాంక్‌బండ్ మీద కురిసిన త్యాగాల తుఫాను
అణచివేత గోడలను కూల్చివేశాయి..!

అమరవీరుల దీవెనలు ఈ రాష్ట్రానికి దీపం..!
ప్రతి శ్వాసలో వినిపిస్తుంది వారి గీతం।

ఉస్మానియా వీధుల్లో ఉరిమిన తెలంగాణ గర్జన నిద్రించిన నేలపై నిప్పుల వర్షం కురిసింది..!
విద్యార్థి అరుపుల్లో విప్లవ నినాదం విని
ఢిల్లీ పీఠం కదలి వచ్చింది..!



పోరాటపు పొలిమేరల్లో పుట్టిన వెలుగు
మా తెలంగాణ..!
అణచివేత రాత్రిని చీల్చిన ఉదయం
మా తెలంగాణ..!

త్యాగధనుల ఆశయాలకు తలవంచి సాగుదాం
బంగారు తెలంగాణ నిర్మాణానికి చేతులు కలుపుదాం
తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.
జై తెలంగాణ

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218

# తెలంగాణ ఆవిర్భావ గాథ

ఉద్యమ జ్వాలల చరిత్ర.

సాధించిన రాష్ట్ర స్వప్నం.

అభివృద్ధి వైపు అడుగులు.



**జనం వాయిస్, డెస్క్, జూన్ 01:**
భారతదేశ రాజకీయ చరిత్రలో జూన్ 2 తేదీ తెలంగాణ ప్రజలకు అత్యంత ప్రాధాన్యమైన రోజుగా నిలిచింది. ఎన్నో దశాబ్దాలుగా సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ రోజు కేవలం ఒక కొత్త రాష్ట్రం ఏర్పడిన రోజు మాత్రమే కాదు, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు నెరవేరిన రోజు కూడా. తెలంగాణ ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం సాగించిన పోరాటానికి ఈ రోజు చారిత్రక గుర్తింపుగా నిలిచిపోయింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. స్వాతంత్ర్యం అనంతరం రాజకీయ పరిణామాలు, ప్రాంతీయ అసమానతలు, నీటి వనరుల పంపిణీ, ఉద్యోగ అవకాశాల విషయంలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందనే భావన ప్రజల్లో బలపడింది. కాలక్రమేణా ఈ అసంతృప్తి ఉద్యమంగా రూపాంతరం చెందింది. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు సహా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములై ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను బలంగా వినిపించారు.

ఉద్యమ కాలంలో అనేక నిరసనలు, ర్యాలీలు, సభలు నిర్వహించబడ్డాయి. వేలాది మంది యువత ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం అనేక మంది తమ జీవితాలను అంకితం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న అమరవీరుల త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వారి త్యాగాలే ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చి రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేశాయి. దీర్ఘకాల పోరాటం అనంతరం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో ఉద్యమకారుల కల నిజమైంది. 2014 జూన్ 2న తెలంగాణ అధికారికంగా దేశంలోని కొత్త రాష్ట్రంగా అవతరించింది. హైదరాబాద్‌ను రాజధానిగా ప్రకటిస్తూ రాష్ట్ర పరిపాలన ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు సంబరాలు చేసుకుంటూ తమ ఎన్నో ఏళ్ల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు.

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ అనేక రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధించింది. సమాచార సాంకేతిక రంగంలో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ పెట్టుబడులను ఆకర్షించింది. పారిశ్రామిక రంగం విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, నగరాల ఆధునీకరణ వంటి అంశాల్లో రాష్ట్రం ముందంజలో నిలిచింది. కొత్త పరిశ్రమలు స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయి. వ్యవసాయ రంగంలో కూడా పలు కీలక కార్యక్రమాలు అమలులోకి వచ్చాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, రైతులకు వివిధ రకాల సహాయక పథకాలు వ్యవసాయాభివృద్ధికి దోహదపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు జరిగాయి. దీని ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో కూడా తెలంగాణ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, సామాజిక సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రతి సంవత్సరం జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా వేదికలలో జెండా ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అమరవీరులకు నివాళి కార్యక్రమాలు జరుగుతాయి. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారిని స్మరించుకుంటూ ప్రజలు ఈ రోజును గర్వంగా జరుపుకుంటారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రజల ఐక్యతకు, ఆత్మగౌరవానికి, అభివృద్ధి సంకల్పానికి ప్రతీకగా నిలుస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తోంది.

# గౌరవం కోసం పోరాటం



హక్కులపై అవగాహన.
భద్రతకు ప్రాధాన్యం.
సమానత్వమే లక్ష్యం.
అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవం.

**జనం వాయిస్, డెస్క్, జూన్ 01:**
ప్రతి సంవత్సరం జూన్ 2న అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. సమాజంలో లైంగిక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, భద్రత, గౌరవప్రద జీవనం వంటి అంశాలపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. సమాజంలో తరచుగా వివక్షకు గురవుతున్న ఈ వర్గం సమస్యలను ప్రపంచ దృష్టికి తీసుకురావడంలో ఈ రోజు కీలక పాత్ర పోషిస్తోంది. లైంగిక కార్మికులు అనేక దేశాల్లో సామాజిక ముద్ర, వివక్ష, ఆర్థిక ఇబ్బందులు, చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఉపాధి అవకాశాల కొరత, పేదరికం, కుటుంబ పరిస్థితులు వంటి అనేక కారణాల వల్ల ఈ రంగంలోకి వచ్చిన వారు సమాజంలో సరైన గుర్తింపు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి జీవన పరిస్థితులపై అవగాహన పెంపొందించడం అవసరమని మానవ హక్కుల సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ దినోత్సవం మూలాలు 1975లో ఫ్రాన్స్‌లో జరిగిన ఒక చారిత్రక నిరసన కార్యక్రమంతో ముడిపడి ఉన్నాయి. అక్కడ లైంగిక కార్మికులు తమ హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి వారి హక్కులపై చర్చలు మరింత విస్తరించాయి. అనంతరం జూన్ 2ను అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవంగా గుర్తించి అనేక దేశాల్లో పాటించడం ప్రారంభమైంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థలు, మానవ హక్కుల సంఘాలు లైంగిక కార్మికులకు ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ అందుబాటులో ఉండాలని సూచిస్తున్నాయి. ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఆరోగ్య సేవలు, అత్యవసర సహాయ వ్యవస్థలు అందరికీ సమానంగా అందాలని అవి పేర్కొంటున్నాయి. సమాజంలో ప్రతి వ్యక్తికి గౌరవప్రద జీవనం హక్కుగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేటి కాలంలో ఆన్‌లైన్ వేదికల ద్వారా కూడా లైంగిక కార్మికులు కొత్త రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నారు. మోసాలు, వేధింపులు, భద్రతా సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించే విధానాల అవసరం పెరుగుతోంది. ఈ అంశాలపై ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఈ వర్గానికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించడంలో సహాయపడుతున్నాయి. అనేక దేశాల్లో స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జీవనోపాధి అవకాశాలను విస్తరిస్తున్నాయి. ఆర్థిక స్వావలంబన కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సమాజంలో ఉన్న అపోహలు, ప్రతికూల అభిప్రాయాలను తొలగించడం కూడా ఈ దినోత్సవం ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. వ్యక్తుల వృత్తి ఏదైనా కావచ్చు, వారికి మానవ హక్కులు, గౌరవం, భద్రత సమానంగా ఉండాలనే సందేశాన్ని ఈ రోజు బలంగా వినిపిస్తుంది. సామాజిక అంగీకారం పెరిగితేనే వివక్ష తగ్గి సమానత్వం సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవం కేవలం ఒక వర్గం సమస్యలపై చర్చించే రోజు మాత్రమే కాదు. మానవ హక్కులు, గౌరవప్రద జీవనం, సమాన అవకాశాల ప్రాముఖ్యతను గుర్తు చేసే సందర్భం కూడా. ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉన్నాడనే సందేశాన్ని ప్రపంచానికి గుర్తుచేస్తూ ఈ దినోత్సవం కొనసాగుతోంది.

# కదలిక కోల్పోతున్న సమాజం

**జనం వాయిస్, డెస్క్, జూన్ 01:**
ఒకప్పుడు మనిషి జీవితం మొత్తం శారీరక శ్రమతో ముడిపడి ఉండేది. నడక, వ్యవసాయం, క్రీడలు, గృహ పనులు, సైకిల్ ప్రయాణాలు నిత్యజీవితంలో భాగంగా ఉండేవి. కానీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేటి కాలంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చిన్న పని కోసం కూడా వాహనాలనే ఆశ్రయించడం, గంటల తరబడి కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల ముందు కూర్చోవడం, యంత్రాలపై పూర్తిగా ఆధారపడటం వల్ల శారీరక శ్రమ గణనీయంగా తగ్గిపోయింది. సౌకర్యాల కోసం మనిషి చేసిన ఆవిష్కరణలే ఇప్పుడు అతని ఆరోగ్యానికి సవాలుగా మారుతున్నాయి. కదలిక తగ్గిపోవడం వల్ల శరీరం సహజ సామర్థ్యాన్ని కోల్పోతుండగా, ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయి. గతంలో వృద్ధాప్యంలో కనిపించే అనేక సమస్యలు ఇప్పుడు యువతలోనే కనిపిస్తున్నాయి. రోజంతా కూర్చునే ఉద్యోగాలు, వ్యాయామం లేని జీవనశైలి, అధిక కేలరీల ఆహారం కలిసి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. శరీరానికి అవసరమైన కదలిక లేకపోవడంతో కండరాలు బలహీనపడుతున్నాయి. శారీరక సామర్థ్యం తగ్గిపోతోంది. వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ చాలా మంది ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగించే అంశంగా మారింది.



ఈ ప్రభావం పెద్దలకే పరిమితం కావడం లేదు. పిల్లల్లో కూడా శారీరక శ్రమ గణనీయంగా తగ్గుతోంది. ఒకప్పుడు పాఠశాల ముగిసిన తర్వాత మైదానాల్లో పరుగులు తీసిన పిల్లలు ఇప్పుడు ఎక్కువ సమయం తెరల ముందే గడుపుతున్నారు. మొబైల్ ఆటలు, వీడియో వినోదం, సామాజిక మాధ్యమాలు వారి బాల్యాన్ని ఆక్రమిస్తున్నాయి. మైదానాలు తగ్గిపోవడం, ఆటలకు అవకాశాలు తగ్గడం కూడా ఇందుకు కారణంగా మారుతోంది. ఫలితంగా చిన్న వయసులోనే ఊబకాయం, కంటి సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి ఇబ్బందులు పెరుగుతున్నాయి. భవిష్యత్తు తరాల ఆరోగ్యంపై ఇది తీవ్రమైన ప్రభావం చూపే ప్రమాదం కనిపిస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం కేవలం శరీరానికే కాదు, మనసుకు కూడా హానికరం. వ్యాయామం చేసే వారిలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ తక్కువగా ఉంటాయని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. అయితే ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, తగ్గుతున్న కదలికలు కలిసి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రోజంతా ఒకే చోట కూర్చోవడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ సరిగా జరగక అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఆరోగ్యవంతమైన జీవితం కోసం శారీరక శ్రమ ఎంత అవసరమో సమాజం మరోసారి గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ సమస్యకు పరిష్కారం అసాధ్యం కాదు. ప్రతి వ్యక్తి రోజూ కొంత సమయం నడక, వ్యాయామం, యోగా, క్రీడలకు కేటాయిస్తే పరిస్థితిలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చు. పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం పెంచాలి. కార్యాలయాల్లో ఉద్యోగులను శారీరక చురుకుదనానికి ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులు కలిసి నడకను అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన సమాజం కోసం కదలికను జీవనశైలిలో భాగం చేసుకోవడం తప్పనిసరి. శారీరక శ్రమను మరిచిపోతున్న సమాజం అనారోగ్య భవిష్యత్తు వైపు అడుగులు వేస్తోందనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి ఇప్పటికైనా మార్పు దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

## జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో

# రాయితీ కల్పించాలి.

## టీఎస్ జేయూ జిల్లా అధ్యక్షుడు గట్టు మహేష్.

**పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం.**

**సానుకూలంగా స్పందించిన డీఈఓ.**

**జనం వాయిస్, పెద్దపల్లి, జూన్ 01:**
సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల పిల్లల చదువులకు ప్రభుత్వం, విద్యాశాఖ అండగా నిలవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయూ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గట్టు మహేష్ జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. సోమవారం పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) జి. శారద ని కలసి, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల్లో రాయితీ కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ... నిరంతరం వార్తల సేకరణలో ఉంటూ సమాజ చైతన్యానికి తోడ్పడే జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉందన్నారు. ముఖ్యంగా కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో, పెరిగిన నిత్యావసరాల ధరలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు భారీగా పెరగడం వల్ల జర్నలిస్టులు తమ పిల్లలను చదివించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఫీజుల దోపిడీని అరికట్టడంతో పాటు, వర్కింగ్ జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజుల్లో కనీసం 50 శాతం రాయితీ ఇచ్చేలా ప్రైవేట్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని వారు డీఈఓను కోరారు. ఈ వినతిపై డీఈఓ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అవునూరి సంపత్ తో పాటు సభ్యులు సాయి వంశీ, సురేష్, సతీష్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.



## వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి!

**ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి!.**

**జర్నలిస్టులను ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీంలో చేర్చాలి!.**

**ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలో ఫీజు రాయితీ కల్పించాలి!.**

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య.**

**జిల్లా కమిటీ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏకగ్రీవ తీర్మానం.**



**ఇబ్రహీంపట్నం, జూన్ 1 ( జనం వాయిస్):**
హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగలు ఇవ్వాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచి పరిణామని, అదే క్రమంలో ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు కూడా సేకరించి ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య ప్రభూత్వాన్ని కోరారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం అబ్దులాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వీవీ బ్యాంకెట్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, జిల్లా అధ్యక్షులు శేరిబాయి గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మైల సైదులు, కోశాధికారి శ్రీనివాస్ చారి, నేషనల్ కమిటీ సభ్యులు దేవేందర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు గణేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య మాట్లాడుతూ... జర్నలిస్టుల అక్రిడిటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఫీల్డ్ జర్నలిస్టుల విషయంలో ఎలాంటి కొర్రిలు పెట్టకుండా కార్డులు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీం జాబితాలో జర్నలిస్టులను చేర్చాలన్నారు. ఇండ్ల జాగాల విషయంలో హైదరాబాద్ కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇచ్చేందుకు చేస్తున్న ఆలోచనలో భాగంగా ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లా జర్నలిస్టుల వివరాలు సేకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరల్నిస్టుల పిల్లల ఫీజు రాయితీ విషయంలో ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ఖచ్చితంగా ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో రాయితీ ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు, డీఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వెంకటేశ్, మణికుమార్, రఘునంధన్ గౌడ్, సుధర్శన్ గౌడ్, శ్రీనివాస్, నర్సింహ్మా, రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యాదగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ శివకుమార్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, అంజి, నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, రఘువేందర్ గౌడ్, రాజు, జైచందర్ , శంకర్, బుచ్చయ్య, జర్నలిస్టులు మల్లేష్, యాకుబ్ పాష, పంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మొశీడోని రాయి తాండ లో ఘనంగా

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు.

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.**

**కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల వికాసం.**

**ఇందిరమ్మ లబ్ధిదారుల సొంతింటి కల అంగోత్ నిల రమేష్ నాయక్.**

**షాద్ నగర్, జూన్ 01, జనం వాయిస్:**
మాట ఇచ్చింది.. ఇల్లు ఇచ్చింది.. పేదల ముఖంలో ఆనందం నింపింది కాంగ్రెస్ ప్రభుత్వం అని షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 15వ వార్డుల్లో మరియు మొశీడోని రాయి తండ గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కూలిపోయే గుడిసెల నుండి పేదలను విముక్తులను చేసి, వారికి ఆత్మగౌరవ ప్రతీకగా పక్కా ఇళ్లను అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ మార్క్ సంక్షేమానికి నిదర్శనమన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం




ద్వారా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

**లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం:**

సొంత ఇంటి కల నిజమవ్వడంతో లబ్ధిదారులు నాగులపల్లి లక్ష్మి, శభానాబేగంలు భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేక పడిన ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ, తమకు పక్కా ఇల్లు అందించి ఆదుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, స్థానిక కౌన్సిలర్లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ గృహప్రవేశాల మహోత్సవంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, స్థానిక కౌన్సిలర్లు దిలీప్ కుమార్, మరియం సాధిక్, అప్పి, కొప్పునూరి ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఇబ్రహీం, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ముబారక్, మున్సిపల్ అధికారులు పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## అడవి శ్రీరాంపూర్ లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

# పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

**జనం వాయిస్, ముత్తారం, జూన్ 1**
ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకం ద్వారా తమ సొంతింటి కల సాకారమవ్వడం పట్ల ఆకోజు రజిని అశోక్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల అండతో పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడం మరువలేనిదని వారు కొనియాడారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ పేదల కష్టాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆశ్రయం కల్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేకించి స్థానిక ప్రాంత అభివృద్ధిపై నిరంతరం శ్రద్ధ వహించే మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కి టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ లాంటి పేద కుటుంబాల జీవితాల్లో ఈ పథకం కొత్త వెలుగులు నింపిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్ పార్టీకి మాకు అండగా నిలిచిన నాయకులకు మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము. నిరుపేదల ముఖాల్లో సంతోషం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఆశయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ శ్రీనివాస్ చారి, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, ముత్తారం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, కమాన్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, గ్రామ సెక్రెటరీ మల్లేశ్వరి,హౌసింగ్ ఏఇ అంకుశ్వాలి, సర్పంచ్– కొట్టే అన్నపూర్ణ ఉపేందర్, ఉపసర్పంచ్ అనవేన హరిత తిరుపతి పాలకవర్గం లక్కం ప్రభాకర్, సాధ కోమలత స్వామి, తుమ్మల సది, రాగుల అంజి, మార్త మహేందర్, దామ మదన్, నిమ్మతి సంపత్, నాయిని సంపత్, గ్రామ శాఖ అధ్యక్షుడు దేశిని



రాజేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చాంద్ పాష, మూగ రవి, నాంసాని సదయ్య, పూసాల సంపూర్ణం, నిమ్మతి రవి, తోడేటి శశి కుమార్, అంబటి కుమార్. లక్కం రాజు, కలవెన సదయ్య, చొప్పరి సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 90% ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును లక్ష్యానికి రెండు రోజులలో చేరుకోవాలి.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**

**తక్కువ నమోదు ఉన్న క్లస్టర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**జనం వాయిస్, పెద్దపల్లి, జూన్-01:**
జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను రెండు రోజులలో 90 శాతానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీపై సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో పీపీబీ హోల్డర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ఫార్మర్ రిజిస్ట్రీ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో ఫార్మర్



రిజిస్ట్రీ నమోదును 90 శాతానికి చేర్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకొని అధికారులు కృషి చేయాలని, 2 రోజులలో లక్ష్యం చేరుకోవాలని సూచించారు. ముఖ్యంగా నమోదు శాతం తక్కువగా ఉన్న క్లస్టర్లపై ప్రత్యేక దృష్టి సారించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏడిఏ అంజని, ఏవోలు, తదితరులు పాల్గొన్నారు.

దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# జోరుగా అక్రమ ఇసుక దందా..!

- "దమ్ముంటే పట్టుకోరా ఛ శికావత్తు..!?" అక్రమార్కుల సవాళ్లు.
- పట్టుకుంటే వదిలేస్తే సిండికేటు.., లేకుంటే బదిలీల వేటు!
- నెలకు రూ.10 లక్షలు ఇస్తే చాలు. ఎంతైనా తోలుకోండి!
- ఇందిరమ్మ ఇళ్ల కూపన్ల పేరిట ప్రైవేటు వ్యక్తులకు తరలింపు: లబ్ధిదారుల జేబులకు చిల్లు.
- ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ హామీలు నీటిమూటలేనా? ప్రజల ప్రశ్న.



**మహబూబాబాద్, జూన్ 1 (జనం వాయిస్) :** డోర్నకల్ నియోజకవర్గ పరిధిలో ఇసుక మాఫియా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. బాధ్యత గల అధికారుల అండదండలతోనే అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నర్సింహులపేట, చిన్నగూడూరు మండలాల పరిధిలోని కొమ్ములవంచ, జైపురం, రామన్నగూడెం, కౌసల్యాదేవిపల్లి, ఫకీర తండా, ముంగిమడుగు, నెల్లికుదురు మండలాల సరిహద్దుల్లోని శివారు ర్యాంపుల నుండి ఇసుకను పంపింగ్ చేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు.

### దమ్ముంటే పట్టుకోరా షికావత్తు..!?

సినిమా డైలాగులను తలపించేలా స్థానికంగా ఇసుక మాఫియా శృతిమించిపోతోంది. గతంలో అక్రమాలను ప్రశ్నించిన వారిని ఉద్దేశించి "దమ్ముంటే పట్టుకోరా షికావత్తు..!?" అంటూ విసిరిన సవాళ్లు ఇప్పుడు నియోజకవర్గంలో మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. ఇసుక వాహనాలను పట్టుకుంటే, వెనకనుండి ఒత్తిళ్లు తెచ్చి రాత్రికి రాత్రే వదిలేలా చేయడం.. అలా వదిలేస్తే అది 'సిండికేటు'గా మారడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. ఒకవేళ అధికారులు వినకుండా కఠినంగా వ్యవహరిస్తే రాజకీయ పలుకుబడితో బదిలీ చేయిస్తున్నారు.

### పోలీస్, రెవిన్యూ అధికారులతో సిండికేట్ :

ఈ అక్రమ దందా వెనుక పెద్ద నెట్‌వర్క్ నడుస్తోంది. ట్రాక్టర్ల యాజమాన్యాలు స్థానిక రెవిన్యూ, పోలీస్ అధికారులతో సిండికేట్‌గా మారినట్లు తెలుస్తోంది. "నెలకు సుమారు రూ. 10 లక్షలు మాకు ముట్టజెప్పండి.. ఎంత ఇసుకైనా తోలుకోండి" అంటూ పోలీసులతో ఒప్పందం కుదిరినట్లు స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. అలాగే నరసింహులపేట పరిధి నుండి ఇసుక తరలించాలంటే స్థానిక రెవిన్యూ అధికారులకు రోజుకు సుమారు రూ. 50 వేలు ఇచ్చుకోవాలనే ఒప్పందం కూడా కుదిరినట్లు సమాచారం. మహబూబాబాద్, నెల్లికుదురు, చిన్నగూడూరు, కురవి, సీరోలు, డోర్నకల్ మండలాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు పగలు, రాత్రి తేడా లేకుండా వందలాది ట్రాక్టర్లతో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పేరిట నిలువుదోపిడీ:

ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ అక్రమార్కులు తమకు కాసుల కురిపించే సాధనంగా మార్చుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట కూపన్లు తీసుకొని, వాటిని అసలైన లబ్ధిదారులకు ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులకు ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. లబ్ధిదారుల నుండి అధికారికంగా ఒక ట్రిప్పుకు రూ. 3500 మాత్రమే తీసుకోవాల్సి ఉండగా, ఈ ఇసుక మాఫియా భేషరతుగా రూ. 6,500 వసూలు చేస్తూ అమాయక పేదలను నిలువునా ముంచుతోంది.

### నీటిమూటలుగా మారిన ఎమ్మెల్యే హామీలు :

గత ఎన్నికల ప్రచారంలో డోర్నకల్ నియోజకవర్గంలో ఇసుక దందా, అవినీతి, అక్రమాలకు పూర్తిగా చెక్ పెడుతానని కాంగ్రెస్ అభ్యర్థి రాంచంద్రు నాయక్ ప్రజలకు పెద్దఎత్తున హామీ ఇచ్చారు. అయితే ఆయన గెలిచిన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోగా, అక్రమాలు మరింత పెరిగాయని, ఆయన ఇచ్చిన హామీలు కేవలం నీటి మూటలుగానే మిగిలిపోయాయని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

### నిజాయితీ గల అధికారిపై బదిలీ వేటు.. అక్రమార్కుల సంబురాలు :

చిన్నగూడూరు మండలంలో గతంలో పనిచేసిన ఒక పోలీస్ అధికారి అక్రమ ఇసుక దందాపై ఉక్కుపాదం మోపారు. అయితే ఇది గిట్టని స్థానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ఒక గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఆ నిజాయితీ గల అధికారిని బదిలీ చేయించారు. ఆ అధికారి బదిలీ కాగానే అక్రమార్కులు స్థానికంగా టపాసులు పేల్చి సంబురాలు చేసుకోవడం గమనార్హం. దీన్ని బట్టి నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

### ప్రస్తుత అధికారి ఏం చేయబోతున్నారు?

గత అధికారిని బదిలీ చేయించి తమకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకున్న అక్రమార్కులకు ప్రస్తుత పోలీస్ అధికారి అడ్డుకట్ట వేస్తారా? లేదా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రస్తుత అధికారి అయినా నిజాయితీగా విధులు నిర్వహించి ఈ అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెడుతారా..? లేక సిండికేట్‌కు తలొగ్గి మౌనం వహిస్తారా..? అని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ఇసుక దోపిడీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బాల్క సుమన్ అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మంచిర్యాలలో బీఆర్ఎస్ భారీ ధర్నా

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్.**

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 01:** కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మంచిర్యాల కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించాయి. మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ గార్ల ఆదేశానుసారం చేపట్టిన ఈ నిరసనలో.. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడమే ధ్యేయంగా ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని మండిపడుతూ, బాల్క సుమన్ గారిని బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని నిరసనను విజయవంతం చేశారు.



## మంచిర్యాల డీఈఓ యాదయ్య బదిలీ



**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 1:** మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) యాదయ్య బదిలీ అయ్యారు. ప్రభుత్వ బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయనను హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిగా బదిలీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. యాదయ్య గతంలో మూడేళ్ల క్రితం మహబూబ్‌నగర్ డీఈఓగా పనిచేశారు. ఆ తర్వాత 2023 మే 5న బదిలీపై మంచిర్యాల జిల్లాకు వచ్చారు. మంచిర్యాలలో తన పదవీ కాలంలో ఆయన పరిపాలనాపరమైన విషయాలు, విద్యా కార్యక్రమాలపై తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా గడచిన మూడేళ్ల కాలంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల నియామకాలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిగా బదిలీ అయిన ఆయనకు పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## రాళ్లవాగుపై భారీ వంతెన నిర్మాణం వెంటనే నిలిపివేయాలి: రఘునాథ్ వెరబెల్లి

- సన్‌సిటీ కాలనీ ప్రజల నిరసనకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మద్దతు.
- బ్రిడ్జి వల్ల 200 కుటుంబాలకు రోడ్డు సౌకర్యం దూరం.. పనులు ఆపకుంటే మున్సిపల్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరిక.

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 01:** మంచిర్యాల పట్టణం అమరవీరుల స్థూపం వద్ద రాళ్ళవాగుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న 100 ఫీట్ల వెడల్పు (6 లేన్) పై వంతెన నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సన్‌సిటీ కాలనీ ప్రజలు నిరసన చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి హాజరై కాలనీవాసులకు పూర్తి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాళ్లవాగుపై భారీ ఎత్తున బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వల్ల సన్‌సిటీలో నివాసం ఉంటున్న 200కు పైగా కుటుంబాలకు రోడ్డు సదుపాయం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద వంతెన అవసరం లేకపోయినా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తోందని ఆయన మండిపడ్డారు. రాళ్లవాగు కాజ్‌వేపై నూతన వంతెన అవసరమైనప్పటికీ.. స్థానిక కార్మెల్ స్కూల్ వద్ద నిర్మించిన వంతెన తరహాలోనే, అంతే ఎత్తుతో ఇక్కడ కూడా బ్రిడ్జి నిర్మించాలని రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులను ఆపివేసి, స్థానిక కాలనీ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఒకవేళ అధికారులు, ప్రభుత్వం స్పందించకుండా పనులను ఇలాగే కొనసాగిస్తే.. త్వరలోనే బాధితులందరినీ కలుపుకొని మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సన్‌సిటీ కాలనీ ప్రతినిధులు, బాధితులు మరియు బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డయేరియా నివారణకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు:

- జూన్ 1 నుండి రెండు దశల్లో ప్రత్యేక అవగాహన ఛ కార్యక్రమాలు
- ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ పంపిణీ
- మారుమూల, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి




**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 01:** జిల్లాలో శిశు మరణాల రేటును తగ్గించే లక్ష్యంతో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డయేరియా నివారణకు జూన్ 1 నుండి జూలై 31 వరకు రెండు దశల్లో ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 1 నుండి 15 వరకు మొదటి దశలో జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, జూన్ 16 నుండి జూలై 31 వరకు రెండవ దశలో ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్, జింక్ డిపోలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను అందుబాటులో ఉంచుతారని, ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాలు, స్లమ్ ఏరియాలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. డయేరియా వల్ల శరీరంలో నీటి శాతం వేగంగా తగ్గిపోతుందని, లక్షణాలు కనిపించిన వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలని, దానిని తయారుచేసే విధానాన్ని తల్లులకు వివరించాలని డాక్టర్ అనిత సూచించారు. ఈ ప్రచారంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత తాగునీటి వాడకం, తల్లిపాల ప్రాముఖ్యత మరియు విటమిన్ 'ఎ' సిరప్ అందించడంపై అవగాహన కల్పిస్తామన్నారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా పిల్లలందరికీ 'రోటా వైరస్' టీకాను తప్పనిసరిగా వేయించాలని, చిన్నపాటి జాగ్రత్తలు మరియు ముందస్తు నివారణ చర్యల ద్వారా పిల్లలను డయేరియా మహమ్మారి బారిన పడకుండా కాపాడుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు.

## జేఈఈ అడ్వాన్స్ లో మెరిసిన గిరిజన ఆణిముత్యం.

**ఆల్ ఇండియా 128వ ర్యాంకు సాధించిన యశ్వంత్ భరత్ రాజ్ నాయక్..**

**జనం వాయిస్ -గార్ల -జూన్ 01:** ఇండియాలో ప్రతిష్టాత్మకమైన ఐఐటిలలో ప్రవేశం కోసం నిర్వహించే జెఈఈ అడ్వాన్స్ ఎంట్రన్స్ టెస్ట్ లో గార్ల మండల పరిధిలోని చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ సర్వన్ తండ గ్రామానికి చెందిన మాలోత్ భద్రు నాయక్ -కుమారి దంపతుల కుమారుడు మాలోత్ యశ్వంత్ భరత్ రాజ్ నాయక్ ఆల్ ఇండియా 128వ ర్యాంకు సాధించారు. 17937 ఓపెన్ ర్యాంకు సాధించి తల్లిదండ్రులు, గ్రామస్తులు, కళాశాల యాజమాన్యం మన్ననలు పొందాడు. యశ్వంత్ భరత్ రాజ్ నాయక్ చిన్నప్పటి నుండే చదువులో రాణించేవాడు. తోటి విద్యార్థులతో కలిసి మెలిసి ఉంటూ చదువులో ఆసక్తి పెంపొందించేలా కృషి చేసేవాడు. 1నుండి 8వ తరగతి వరకు మహబూబాబాద్ మహర్షి విద్యాలయంలో, 9-10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ఖమ్మం శ్రీ చైతన్య స్కూల్, కళాశాలలో చదువుతూ మొదటి ప్రయత్నంలోనే ఆల్ ఇండియా ర్యాంకు సాధించడం పట్ల యువకులు, విద్యార్థులు, ప్రజలు అభినందిస్తున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు బయ్యారం మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, తండ్రి భద్రి నాయక్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ నెలలో విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 70, జేఈఈ మెయిన్స్ పేపర్ 2బి ఆర్క్, బి ప్లానింగ్ పరీక్షల్లో ఆల్ ఇండియా 40వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ, ఇండియాలో ప్రతిష్టాత్మకమైన టాప్ ఐఐటీలలో చేరి శాస్త్రవేత్తగా అయ్యి దేశ సేవ చేయాలనే కోరిక ఉందని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.




## మంచిర్యాల నూతన ఏసీగా రాజు బాధ్యతల స్వీకరణ

**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 01:** మంచిర్యాల నూతన అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ నుండి బదిలీపై వచ్చిన ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన మెరుగుపరచడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఆయన తెలిపారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఏసీ రాజుకు మున్సిపల్ సిబ్బంది మరియు అధికారులు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**మైనార్టీ విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యకు ప్రభుత్వం అండ.**
**జూన్ 1 నుంచి 30 వరకు దరఖాస్తుల స్వీకరణ.**

**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 01:** మంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మైనార్టీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం (ఫాల్ సెషన్2026) కింద అర్హులైన మైనార్టీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి (ఇన్‌చార్జ్) నీరటి రాజేశ్వరి తెలిపారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, న్యూజిలాండ్ తదితర దేశాల్లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో పీజీ లేదా పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు జూన్ 1 నుంచి జూన్ 30, 2026 సాయంత్రం 5 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు గరిష్టంగా రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదని, అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన హార్డ్ కాపీలను జూలై 31, 2026 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అర్హులైన మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని అధికారులు పేర్కొన్నారు.

## మీర్జాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు.

**జనం వాయిస్.హుస్నాబాద్ జూన్ 01:** హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు అత్యంత ఘనంగా నిర్వహించారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను అనతి కాలంలోనే పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ సంపత్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారుల కళ్ళలో ఆనందం చూస్తున్నామని అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడల స్వరణ్ మార్ , గ్రామ కార్యదర్శి ప్రసాద్, వార్డు సభ్యులు జోష్ణ, రేణుక, స్వరూప, తిరుపతి, లబ్ధిదారులు లక్ష్మి, పిట్టల కవిత, తరాల సౌమ్య, గ్రామ మాజీ సర్పంచ్ తరాల లతా మహేందర్, గ్రామస్తులు సంపత్, రాజమల్లు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారుడు మహేందర్ విజ్ఞప్తి



**కాప్రా జూన్ 1( జనం వాయిస్):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి 12 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమరుల కుటుంబాలు, ఉద్యమకారులు, నిరుద్యోగ యువత సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ఉద్యమకారుడు మహేందర్ కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన 1200 మందికి పైగా అమరుల కుటుంబాలకు మరింత ఆర్థిక, సామాజిక భరోసా కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని కోరారు. అదేవిధంగా, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రస్తుతం నిరుద్యోగులుగా ఉన్న యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తాను తెలంగాణ ఉద్యమ సమయంలో కేంద్ర ప్రభుత్వ ఫైర్‌మ్యాన్ ఉద్యోగానికి ఎంపికైనప్పటికీ, ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించాలనే సంకల్పంతో ఆ ఉద్యోగ అవకాశాన్ని వదులుకుని ఉద్యమంలో పాల్గొన్నానని మహేందర్ తెలిపారు. అనంతరం ఉద్యోగ నియామకాలు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో తాను సహా అనేక మంది ఉద్యమ నేపథ్యం కలిగిన యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఉద్యమకారులు మరియు అమరుల కుటుంబాల పట్ల తన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆయన కోరారు.

# అటెండర్‌పై మహిళ చెప్పుతో దాడి

- అసభ్య ప్రవర్తన ఆరోపణల నేపథ్యంలో ఉద్రిక్తత.
- ఇరువర్గాలను శాంతింపజేసిన పోలీసులు, సిబ్బంది.
- కేసు నమోదు చేసి దర్యాప్తు.





**మహబూబాబాద్, జూన్ 1 (జనం వాయిస్) :**
మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న మురళిపై ఓ మహిళ, ఆమె బంధువులు చెప్పుతో దాడి చేసిన ఘటన సోమవారం కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు, కలెక్టరేట్ సిబ్బంది వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన యాకమ్మ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూమిని కోల్పోయిన నేపథ్యంలో నష్టపరిహారం కోసం కొంతకాలంగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె తిరిగి గ్రామానికి వెళ్తుండగా, కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న మురళి తాను కూడా అదే దారిలో వెళ్తున్నానని చెప్పి తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే మార్గమధ్యలో మురళి తనతో అసభ్యంగా ప్రవర్తించాడని మహిళ ఆరోపించింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో ఆగ్రహానికి గురైన బంధువులు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని మురళిపై చెప్పుతో దాడి చేశారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, కలెక్టరేట్ సిబ్బంది వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆరోపణలపై పూర్తి వివరాలు విచారణ అనంతరం వెలుగులోకి రానున్నాయి.

# యువత ముందుకు రావాలి

## క్రీడల ద్వారా యువతలో స్ఫూర్తి, సేవాభావం పెంపొందిద్దాం : లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం.



**మహబూబాబాద్, జూన్ 1(జనం వాయిస్):**
ఆర్ట్ ఆఫ్ గివింగ్2026 కార్యక్రమాలను మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు యువత, క్రీడాకారులు, స్వచ్ఛంద సేవకులు, సామాజిక సేవా సంస్థలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆర్ట్ ఆఫ్ గివింగ్ కోఆర్డినేటర్ జర్నలిస్ట్ రమేష్ సహకారంతో జిల్లాలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, "జాయ్ ఆఫ్ గివింగ్" సందేశాన్ని ప్రతి గ్రామానికి చేర్చడం లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వేసవికాలంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు, చెరువులు, బావుల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా క్రీడల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో యువతను శారీరకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దేందుకు వాలీబాల్ కిట్ల పంపిణీ, క్రీడా పోటీలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్ట్ ఆఫ్ గివింగ్2026 సహకారంతో జమాండ్లపల్లి, ఈదులపూసపల్లి, అమనగల్లు, కురవి గ్రామాల్లో వాలీబాల్ కిట్ల పంపిణీ చేపడుతున్నట్లు వెల్లడించారు. సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని, యువతలో సానుకూల మార్పు తీసుకురావడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాకర్స్ సభ్యులు, జిల్లా సీపీఎం కార్యదర్శి సాధుల శ్రీనివాస్, జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కామ సంజీవరావు పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. అనంతరం మహబూబాబాద్ మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ దూపాటి స్పందన వినయ్, 2వ వార్డు కౌన్సిలర్ అంబాల శివకుమార్‌లకు అతిథులు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ చాంప్ల నాయక్, అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రఘు, సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు సుజిత్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, వాకర్స్ సభ్యులు పరంధామయ్య, చిదిరాల శరత్, ఎర్రోజు శేఖర్, మెడికల్ రవి, పిట్టల నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా సి.ఎం.ఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.
- రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యం కొనుగోలు ల ప్రక్రియ సాగాలి.
- రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.

**జనం వాయిస్,మంచిర్యాల, జూన్ 1:**
రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర చెల్లించి, నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలిస్తున్నామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రైస్ మిల్లుల నిర్వాహకులు సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండల పరిధిలోని ఎస్ ఆర్ ఎం రైస్ మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములుతో కలిసి, అలాగే గాయత్రి రైస్ మిల్లును మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులకు కేటాయించిన ధాన్యం సి ఎం ఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ తన పర్యటనలో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలోని శ్రీరామ రైస్ మిల్లును సందర్శించి, మండల తహసిల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియ సాగాలని, ఎక్కడా కాలయాపన జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మిల్లుల నిర్వాహకులు కూడా ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి లక్ష్యాలను త్వరగా పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. ఆ తర్వాత దండేపల్లి మండలంలోని జై యోగేశ్వర రైస్ మిల్లుతో పాటు దండేపల్లి, కొర్విచెల్మ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు.



# మద్దతు ధరలు పెంచాలి ఎరువుల ధరలు నియంత్రించాలి

- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన, మద్దతు ధరల పత్రాల దహనం

**మహబూబాబాద్, జూన్ 1 (జనం వాయిస్):**
కేంద్రప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలు (MSP) నామమాత్రంగా ఉన్నాయని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (SKM) జాతీయ కమిటీ పిలుపు మేరకు మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మద్దతు ధరల పత్రాలను దహనం చేసి తమ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ గుజ్జు దేవేందర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లపు సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న, వరి తదితర పంటల మద్దతు ధరలను స్వల్పంగా మాత్రమే పెంచి రైతులను నిరాశపరిచిందని విమర్శించారు. ఒకవైపు ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచి వ్యవసాయ వ్యయాన్ని పెంచగా, మరోవైపు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమవుతోందన్నారు. యూరియా, డీఏపీ సహా ఇతర ఎరువుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించి వాటికి చట్టబద్ధ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్చు వీరయ్య, కిషన్, వీరన్న, తావుర్య, జమున, శాంతి, సునీత, నారాయణ, వెంకన్న, సైదులు తదితర రైతులు పాల్గొన్నారు.




# యువతలో దేశభక్తి పెరగాలి

- సమాజం పట్ల మంచి అవగాహనతో ఎదగాలి.
- సైన్యంలో ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం.
- కురవి ఎస్ఐ సతీష్.

**కురవి, జూన్ 1 (జనం వాయిస్):**
యువతలో దేశభక్తి పెరగాలని, క్రమశిక్షణతో జీవితాన్ని నిర్మించుకోవాలని, సమాజం పట్ల మంచిఅవగాహనతో గుర్తింపు కలిగిన వ్యక్తులుగా ఎదగాలని కురవి ఎస్ఐ సతీష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ది సోల్జర్స్ డిఫెన్స్ ఇనిస్టిట్యూట్ లో శిక్షణ పొందిన తొమ్మిది మంది యువకులు భారత సైన్యంలో ఉద్యోగాలు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక భాస్కరసేవాసమితి ఆధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమాన్ని సోమవారం కురవిలో నిర్వహించారు. బాస్కరసేవాసమితి వ్యవస్థాపకఅధ్యక్షులు, టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ..సన్మాన కార్యక్రమంలో ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన ఉమేష్, నవీన్, అనిల్, లక్ష్మణ్, దిలీప్, ప్రవీణ్, శ్రీనాథ్, వీరభద్రం, రాఘవ లను ఘనంగా సన్మానించారు. కురవిలో ది సోల్జర్స్ డిఫెన్స్ ఇనిస్టిట్యూట్ ను ప్రారంభించిన కల్నల్ శ్రీనివాస్ రావు కు ఈ.. సందర్బంగా భాస్కరసేవాసమితి పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ..తొమ్మిది మందే కాకుండా కురవి మైదానంలో శిక్షణ ఇస్తూ సుమారు వందమందికి పైగా.. ఆర్మీ, పోలీస్ విభాగాల్లో ఉద్యోగాలు రావడంలో అత్యంత కీలకపాత్ర పోషించిన ఫిజికల్ డైరెక్టర్, కోచ్ కర్ణం సింధువర్మ ను కూడా ఈ..సందర్బంగా ఘనంగా సన్మానించారు. అనంతరం భాస్కరసేవాసమితి వ్యవస్థాపకఅధ్యక్షుడు, టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశరక్షణ కోసం వీరజవానులుగా సైన్యంలోకి వెల్లడం అంటే దానిని మించిన అంశం మరొకటి లేదని.., ఇది గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. మీరు సైన్యంలో పనిచేస్తే మీ.. కుటుంబాలను, మీ.. భవిష్యత్ ను దేశం తన బాధ్యతగా పరిరక్షిస్తుందని, అంకితభావంతో శిక్షణ పూర్తి చేసుకుని, మీ.. తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి, మహబూబాబాద్ జిల్లాకు గొప్ప కీర్తిప్రతిష్టలు తేవాలని కోరారు. ప్రస్తుతం యువత వీరిని ఆదర్శంగా తీసుకుని తాము ఎంచుకున్న రంగంలో విజయాలు సాదించాలని, చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా కురవి ఎస్ఐ సతీష్ ను బాస్కరసేవాసమితి పక్షాన ఘనంగా సన్మానించారు. ఈ..కార్యక్రమంలో కురవి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బాదావత్ లక్ష్మీరాజునాయక్, కురవి ఆలయ మాజీచైర్మన్ బాదావత్ రాజునాయక్, భాస్కరసేవాసమితి సలహాదారు కొణతం విజయ్, సంగెం నాగరాజు, నవీన్, మాజీ ఉపసర్పంచ్ సంగెం భరత్, వార్డ్ సభ్యులు ప్రమోద్, శీను, ఏఎస్ఐ వెంకన్న, కానిస్టేబుల్ నిఖిల్ వర్మ, కాశీరాం, అనిత, ఆర్మీ జవాన్లు ప్రేమ్ కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్రశీలో అత్యంత ప్రసిద్ధి గాంచిన హుస్నాబాద్ రేణుకా మాతని దర్శించుకున్న- సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు



**జనం వాయిస్, కోహెడ, జూన్.01:**
తెలంగాణరాష్ట్రశీలో అత్యంత ప్రసిద్ధి పొందిన హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లీని అదివారం ప్రముఖ సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెదాలని తెలంగాణ రాష్ట్ర ప్రజలు, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని రాజు పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అనేక సామాజిక చైతన్య కార్యక్రమాలు చేస్తూ నిత్యం ప్రజా శ్రేయస్సు కై పనిచేస్తున్నా పిడిశెట్టి రాజు ని ఆలయ ఈవో పీ. కిషన్ రావు,మునిసిపాలిటీ చైర్మన్ దండి లక్ష్మి - కొమురయ్య లు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కో - ఆఫషన్ భూక్య సరోజన, పీ. మాధవి,ధర్మకర్త పున్న సారయ్య, ఆలయ సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి. కలెక్టర్ స్నేహ శబరీష్.

**మహబూబాబాద్, జూన్ 1 (జనం వాయిస్) :**
ప్రజావాణిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, అదనపు కలెక్టర్ (ఇంచార్జ్ స్థానిక సంస్థల) పురుషోత్తం పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా వినతులను స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్ మరియు (ఇంచార్జ్) పురుషోత్తం పర్యవేక్షణలో, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకమైన పాలన అందించడమే



ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 02న జరుపు తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, వచ్చిన అతిథులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మంచినీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, మరియు వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వినతులు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రజావాణి కార్యక్రమం ల మొత్తం ( 142 ) దరఖాస్తులు వచ్చాయి.

**ప్రజావాణిలో అవినీతి అక్రమాలపై పిర్యాదులు...,**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన సమైక్యలో జరిగిన అవినీతిపై, నిధుల రికవరీ కోసం గిరిజన సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. మరిపెడ మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకన్న, పాకాల చెరువు వేలంపాట నిధుల అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. బగ్గంపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తన ఇంటి ముందున్న విద్యుత్ స్తంభం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, దానిని తొలగించాలని విన్నవించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని SFI జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. కమలాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

RNI NO:TGTEL/26/A0383
జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

## భూమి సారాన్ని కాపాడుకుందాం.

**రైతులకు అధికారుల పిలుపు.**
**చౌటపల్లి, గోవర్ధనగిరిలో ఖేతి బచావో అభియాన్ అవగాహన కార్యక్రమం.**



**జనం వాయిస్ అక్కన్నపేట, జూన్.01:**
వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేతి బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా అక్కన్నపేట మండలం చౌటపల్లి, గోవర్ధనగిరి గ్రామాలలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, వ్యవసాయ విస్తరణ అధికారులు ఐశ్వర్య, శేఖర్ పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు చేశారు. పంట అవశేషాల దహనం (స్టబుల్ బర్నింగ్) వల్ల నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి, నేల సారం తగ్గిపోవడంతో పాటు వాతావరణ కాలుష్యం పెరుగుతుందని వివరించారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా పొలంలోనే కలిపి సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని సూచించారు. యూరియా ఎరువును అవసరానికి మించి వినియోగించకుండా, నేల పరీక్షల ఆధారంగా మాత్రమే వాడాలని తెలిపారు. అధికంగా యూరియా వాడటం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు నేల ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. మార్కెట్లో మంచి ధరలు లభించే అవకాశాలు ఉన్నందున రైతులు సన్న రకాల వరి వంగడాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులను ఎక్కువగా ఉపయోగించాలని అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం మెరుగుపడి స్థిరమైన వ్యవసాయం సాధ్యమవుతుందని వివరించారు. జీవామృతం, ఘన జీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరించాలని సూచించారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ శాస్త్రీయ, ప్రకృతి అనుకూల వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు, ఆదాయం పొందాలని అధికారులు రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు..!

**బొలిశెట్టి శివయ్య, సింగిల్ విండో చైర్మన్ హుస్నాబాద్**
**వంగ రామయ్య పల్లి లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు.**

**జనం వాయిస్, హుస్నాబాద్, జూన్ 01:**
హుస్నాబాద్ మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు సోమవారం హుస్నాబాద్ మండల పరిధిలోని వంగరామయ్యపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు స్థానిక సర్పంచ్ భూక్య రాజేశ్వరి తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవానికి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కచ్చితంగా పథకాన్ని వర్తింపజేసేలా కృషి చేస్తున్నట్లు వారన్నారు.ఇంకా ఎవరైనా అర్హులైన లబ్ధిదారులు ఉంటే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో వస్తాయని అలాంటి వారు నిరాశ చెందవద్దని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య రాజేశ్వరి తిరుపతి నాయక్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంగ వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్యామకూర రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బందేల హరీష్,మాజీ ఉపసర్పంచ్ బోడ శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్యదర్శి భూక్య శారద,వార్డ్ మెంబర్లు బోడ రమేష్, లావుడ్య రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దాడి కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్.

**- పరకాల సబ్ జైలుకు తరలింపు**

**జనం వాయిస్, శాయంపేట, జూన్ 1:**
శాయంపేట మండల కేంద్రానికి చెందిన చిందం రవిపై ఇటీవల జరిగిన దాడి ఘటనకు సంబంధించి నమోదైన కేసులో నిందితుడైన మారేపెల్లి రాహుల్ ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని పరకాల ప్రధాన న్యాయమూర్తి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సాయి శరత్ ఎదుట హాజరుపరచగా, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు తరలించినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. చిందం రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై వెల్లడించారు.

# రైతులకు భూపట్టాలు ఇప్పిస్తానంటూ రెవిన్యూ అధికారి కుచ్చుటోపి..?

**రెవిన్యూ శాఖలో భారీ అవినీతి అధికారి..!**
**భూపట్టా విషయంలో లక్షలు కాజేసిన ఆర్ ఐ అఖిలేష్.**
**బాధితులు ప్రజావాణిలో ఆర్డీవోకు ఫిర్యాదు.**






**జనం వాయిస్.హుస్నాబాద్, జూన్ 01:**
రైతుల సాదా బైనామాల భూములకు పట్టాలు ఇప్పిస్తానని లావణి భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మించి రెవెన్యూ అధికారి రైతులు దగ్గర లక్షలు దండుకున్నాడని ఆరోపిస్తూ హుస్నాబాద్ ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డిఓ రామ్మూర్తికి ప్రజావాణిలో బాధితులు నీరుకొండ దేవయ్య బల్ల బాలరాజు సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గోపాలపూర్ గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు.సదరు అధికారి నీరుకొండ దేవయ్య నుంచి 18లక్షల 80 వేలు తీసుకున్నాడని,బల్ల బాలరాజు నుంచి నాలుగు లక్షల 80 వేల రూపాయలు తీసుకున్నాడని ఆరోపించారు.ఇంకా ఈ మండలంలో అనేకమంది బాధితుల నుండి లక్షల రూపాయలు ఆర్ ఐ రామా అఖిలేష్ వసూలు చేశాడని ఆరోపించారు. హుస్నాబాద్ ఆర్డిఓ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరిడేంట్ రామ అఖిలేష్ అనే అధికారి ఇంతకుముందు సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లో ఆర్ఐగా పనిచేస్తుండేవాడు. అక్కడ రైతులతో మమేకమై భూ సమస్యలు పరిష్కరిస్తారంటూ సాదా బైనమాలను పరిష్కరించి పట్టాలు ఇప్పిస్తానని 2011 సంవత్సరం నుండి ఇప్పటివరకు సదరు అధికారి రైతుల దగ్గర లక్షల రూపాయలు దండుకొని బకాయిస్తున్నాడని ఆరోపించారు లావని పట్టా ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని నమ్మబలికాడని ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఎదుట బాధితులు వేడుకున్నారు.సదరు రెవెన్యూ అధికారిని భూ సమస్యలపై తీసుకున్న డబ్బుల విషయం గురించి అడిగితే నాకేం తెలవదు అని మాట దాటేస్తున్నాడని ఆరోపించారు ఇప్పటికీ 15 సంవత్సరాలు గడుస్తున్నా మా సమస్యలకు పరిష్కారం లభించడం లేదని బాధితులు వాపోయారు.భూ సమస్యలు పరిష్కరిస్తానంటే మా భార్య పిల్లల పుస్తెలతాడు బంగారు కమ్మలు గొలుసులు అమ్మి సదరు అధికారికి నగదు ముట్ట చెప్పామని బోరున విలపించారు.ఈ అవినీతికి పాల్పడ్డ అధికారిని రెవెన్యూ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని అదేవిధంగా బాధితుల నుండి తీసుకున్న డబ్బులను వెంటనే రికవరీ చేసేలా కృషి చేయాలని కోరారు లేనిచో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మరియు బాధితులు ఇంటి ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని బాధితులు హెచ్చరించారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించడమే లక్ష్యం ముత్తారం ఏఓ

- స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ కచ్చితంగా పరిశీలిస్తాం.
- రైతులకు రసీదులు ఇవ్వకుంటే చర్యలు తప్పవు.

**జనం వాయిస్, ముత్తారం, జూన్ 1:**
ముత్తారం మండల కేంద్రం లోని రైతు వేదిక లో వానకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన సాగు దిగుబడులు అందించడమే లక్ష్యంగా విత్తన ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వ్యాప్తంగా ఉన్న డీలర్లు అందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ డీలర్లు వ్యాపారం తో పాటు సాగు చేసే రైతులకు నష్టం జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మార్కెట్లోకి నకిలీ విత్తనాలు రాకుండా కేవలం గుర్తింపు పొందిన కంపెనీల నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి దుకాణంలోనూ విక్రయాలకు సంబంధించిన రికార్డులు పారదర్శకంగా ఉండాలని ఏఓ స్పష్టం చేశారు. డీలర్లు కచ్చితంగా స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్ మరియు రోజువారీ స్టాక్ రిపోర్ట్లను అప్డేట్గా ఉంచాలి. ఎరువుల డీలర్లు తమ ఈ-పాస్ మెషిన్లోని స్టాక్ను మరియు గిడ్డంగిలోని గ్రౌండ్ బ్యాలెన్స్ను నిరంతరం సరిచూసుకోవాలి. ఇందులో ఎలాంటి తేడాలు ఉన్నా నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తాం. దుకాణానికి వచ్చే ప్రతి రైతుకూ వారు కొనుగోలు చేసిన పురుగు మందులకు సంబంధించి కచ్చితమైన రసీదు ఇవ్వడం డీలర్ల ముఖ్య బాధ్యత. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసినా సదరు డీలర్లపై చట్టరీత్యా చర్య లు తీసుకొని వారి లైసెన్సులను రద్దు చేస్తాం. లైసెన్స్ ఉన్న డీలర్లు మాత్రమే విక్రయాలు జరపాలి అని సూచించారు. ఈ అవగాహన సదస్సులో మండల వ్యవసాయ అధికారులు అనూష మరియు మండలంలోని విత్తన, ఎరువుల వ్యాపారులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ పోటీల్లో మెరిసిన సంగారెడ్డి మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు.

**అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.**

**జనం వాయిస్, పటాన్చెరు, జూన్ 01:**
నేటి తరం యువతకు స్ఫూర్తిని అందించేలా అంతర్జాతీయ పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన అందించి.. భారతదేశ గొప్పతనాన్ని అంతర్జాతీయ వేదికపై గర్వపడేలా చేయడం అభినందనీయమని పటాన్చెరు శాసన సభ్యులు, మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ ప్యాట్రాన్ గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత నెల 23, 24వ తేదీలలో శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ మీట్ లో భారత దేశం తరపున సంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కు చెందిన 14 మంది క్రీడాకారులు (35 సంవత్సరాల నుండి 100 సంవత్సరాల లోపు) వివిధ క్రీడా పోటీలలో పాల్గొన్నారు. మొత్తం 52 పతకాలు సాధించగా..వీటిలో బంగారు పతకాలు 27, వెండి పతకాలు 11, కంచు పతకాలు 4 ఉన్నాయి. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే జిఎంఆర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గత 20 సంవత్సరాలుగా తమ క్రీడా పోటీలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ 80, 90 ఏళ్ల వృద్ధాప్యంలోను అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని అభినందించారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని పథకాలు సాధించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఫహీం ఇక్బాల్, ప్రధాన కార్యదర్శి శామ్యూల్, ఉపాధ్యక్షులు బాలయ్య, నరేందర్ రెడ్డి, భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎల్లోర, సభ్యులు కరుణాకర్ రావు, మల్లయ్య గౌడ్, నిర్మల, అనసూయ, సరోజినీ, తదితరులు పాల్గొన్నారు.



## నూతనకల్‌కానుకుంట రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టాలి

**పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌కు కౌన్సిలర్ల వినతి.**

**మేడ్చల్, జూన్ 1(జనం వాయిస్):**
ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూతనకల్ గ్రామం నుంచి కానుకుంట గ్రామానికి కలిపే పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో తరచూ వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ గాయపడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ 16వ వార్డు కౌన్సిలర్ సద్ది సురేష్ రెడ్డి, 21వ వార్డు కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఈఈ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారి దుస్థితిని వివరించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రంపై స్పందించిన ఈఈ చంద్రశేఖర్, ఆమ్ ప్రాజెక్టు ద్వారా రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ పనులను త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదల పక్షానే సాయిపేట శ్రీనివాస్

**ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరాలి**




**మేడ్చల్, జూన్ 1(జనం వాయిస్):**
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ డివిజన్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి 299వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు గృహ నిర్మాణ అవకాశాలు కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు. పేదల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కుటుంబం సురక్షితమైన గృహంలో నివసించేలా చర్యలు కొనసాగుతాయని సాయిపేట శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# విధి విధానాలు లేవు వేతనంలో కోత సరైనది కాదు

**ఆరోగ్య పథకం మార్గదర్శకాలు ప్రకటించండి.**
**టీపీటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్.**



**జనం వాయిస్, సంగారెడ్డి:**
ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయబోతున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలు చేయడం కోసం మార్గదర్శకాలు లేకుండానే వేతనంలో కోత పెట్టడం సరైనది కాదు అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ ఆరోపించారు. ఆరోగ్య పథకం విధివిధానాలు, మార్గదర్శకాలు, హాస్పిటాళ్ల జాబితా, వ్యాధుల ప్రస్తావన లేకుండా ప్రభుత్వ తాత్సారం సరికాదని అన్నారు. వెంటనే మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. జూన్ 2 నుండి పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పి, ఇంతవరకు విధివిధానాలు జారీ చేయకపోవడం శోచనీయం. ఇందుకోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల నుండి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి, ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ సైటులో నమోదు చేస్తున్నారు. ఆన్ లైన్ చేయడంలో కూడా చాలా ఇబ్బందులు ఎదురవుతున్నా పరిష్కారం చెప్పేవాళ్ళు లేకుండాపోయింది. వివరాలు నమోదుకు మే 31 చివరి తేదిగా ప్రకటించారు కానీ ఆన్ లైన్ సమస్యలకు జవాబు ఇచ్చే సాంకేతిక నైపుణ్యం దొరకడం లేదు. ఒకసారి వివరాలు నమోదు చేయాలని, మరొకసారి అంగవైకల్యం ఉందా లేదా తెలుపాలి, ఇంకొకసారి కుటుంబ సభ్యుల ఫోటోలు అప్ లోడ్ చేయాలని రోజుకో నిబంధనతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులైతే ఇద్దరూ తమ వివరాలు నమోదు చేసుకోవాలా ? ఎవరో ఒకరు చేసుకుంటే సరిపోతదా ? అలాగే ఇద్దరూ వేతన మినహాయింపు చేసుకోవాలా ? ఒకరే చేసుకోవాలా ? అనే విషయాల పట్ల వివరణ లేకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ఇప్పటి వరకు కూడా హాస్పిటల్ జాబితా ప్రకటించలేదు, ఏయే వ్యాధులకు ఎంత మొత్తం నిర్ణయించలేదు, ప్రయివేటు హాస్పిటాళ్ల అంగీకారం తెలుపలేదు. ఇన్ని సవాళ్లు ఎదురవుతున్న క్రమంలో పథకం అమలు విషయంలో ప్రభుత్వం నుండి విధివిధానాలు ప్రకటించకపోవడం అమలులో చిత్తశుద్ధి కనిపించడంలేదు. ఇకనైనా విధివిధానాలు, మార్గదర్శకాలు జారీ చెసి, వివరాలు ఆన్ లైన్ చేయడంలో సమస్యలు తలెత్తుతున్న దృశ్యా నమోదు గడువును పెంచాలని టీపీటీఫ్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమ నాయకులు రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ భూమి శ్రీనివాస్, వెంకట్ రాథోడ్, భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పటేల్, మల్లికార్జున్, విజయ్ భాస్కర్, విట్టల్, బాబు రావు, జిల్లా కార్యదర్శులు అశోక్ కుమార్, గోవింద్, మేకల శ్రీనివాస్, జగన్నాథం, కిషన్ రావ్, దీపక్ కుమార్, ప్రభాకర్, కిష్టయ్య, అజీమ్, నాగేశ్వర్, రహీం, మొదలగువారు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు: రామగుండం సీపీ



**జనం వాయిస్, మంచిర్యాల, జూన్ 01:**
సాధారణ పౌరులు మరియు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని మంచిర్యాల జోన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాన్ని కొనసాగిస్తున్నట్లు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ ఆంక్షలు జూన్ 1 నుంచి జూలై 1 వరకు అమల్లో ఉంటాయని, ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి ఈ గడువును మరింత పొడిగిస్తామని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి బహిరంగంగా మద్యం సేవించే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు ఉంటాయని సీపీ హెచ్చరించారు.

# పెద్దపల్లి జిల్లాలో 'పర్యావరణ వారోత్సవాలు ప్రారంభం.

**మొక్క నాటిన జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి.**

**జనం వాయిస్, పెద్దపల్లి, జూన్- 01:**
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా, తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ వారోత్సవాలను జూన్ 1 నుండి జూన్ 12 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి మొక్క నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాబోయే 12 రోజుల పాటు జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం అటవిశాఖ ఆధ్వర్యంలో, రాంపల్లి,ఏ క్లాస్పూర్ గ్రామాలలో ప్రజలకు పర్యావరణ అవగాహన సదస్సులను, అగ్ని ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను ,పర్యావరణ సమతుల్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ అటవీ శాఖ అధికారులు ఈ. సతీష్ కుమార్, వినయ్ నాయక్ , దేవదాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.




# రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో బి ఆర్ ఎస్ నేతల ముందస్తు అరెస్టులు ఖండనీయం

**మందమర్రి, జూన్ 1 (జనం వాయిస్):**
ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సందర్భంగా మందమర్రి పట్టణానికి చెందిన బి ఆర్ ఎస్, బి ఆర్ ఎస్ వి ,బి ఆర్ ఎస్ వై నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడంలో ఆసక్తి చూపుతోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం, పోలీసు వ్యవస్థను రాజకీయ అవసరాలకు వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అలాగే విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను అణిచివేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నాయకులపై కొనసాగుతున్న అణచివేత చర్యలను తక్షణమే నిలిపివేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బి ఆర్ ఎస్ వి బిఆర్ఎస్ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని, విద్యార్థి హక్కుల కోసం తమ పోరాటం ఎప్పటికీ ఆగదని స్పష్టం చేశారు. ముందస్తు అరెస్టులకు గురైన నాయకులు: ఏల్పుల రవీందర్, లౌడం రాజ్‌కుమార్, ఎండి ఫిరోజ్, సది, తోట సురేందర్, దాసరి నవీన్, సీపెల్లి సాగర్, మాసు వెంకటేష్, అందే శ్రీకాంత్, ఎండీ పాషా తదితరులు.



# పాశమైలారం పారిశ్రామిక వాడలో ప్రమాదాలకు కేరాఫ్ గా మారిన ఆల్వా చౌరస్తా

**బిపిఎల్ చౌరస్తా నుండి ఎక్స్పోర్ట్ జోన్ వరకు రోడ్డు వెడల్పు చేసి రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలి.**
**పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్.**

**జనం వాయిస్ :పటాన్చెరు జూన్ 01:**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఆల్ఫా చౌరస్తా ప్రమాదాలకు కేరాఫ్ గా మారిందని వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. ఈరోజు ఆల్ఫా చౌరస్తాలో కారు బైక్ యాక్సిడెంట్ జరిగింది. ప్రమాదాలను అరికట్టాలని అల్ఫా చౌరస్తా వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ పాశమైలారం పారిశ్రామిక వాడలో భారీ పరిశ్రమలు ఉన్నాయని అనేక కొత్త పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. కార్మికులు డ్యూటీకి వెళ్లేటప్పుడు డ్యూటీ నుండి వచ్చేటప్పుడు పెద్ద ఎత్తున ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. ఆల్ఫా చౌరస్తా పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు ఆల్ఫా చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిపిఎల్ చౌరస్తా నుండి ఎక్స్పోర్ట్ జోన్ వరకు రోడ్డు వెడల్పు చేసి రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డు కూడా గుంతలు పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు గుంతలు పడిన రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ నాయకులు వెంకటేష్ జైపాల్ శ్యామ్ బాబు సోమన్న ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..



# గరీబోళ్ల ఇళ్లల్లో ఆనందమే... ప్రజా ప్రభుత్వం లక్ష్యం

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్.**

**కాప్రా జూన్ 1 ( జనం వాయిస్ ):**
గరీబోళ్ల ఇళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆరు గ్యారంటీ పథకాలతో తెలంగాణ స్వర్ణయుగలంలా మారుతుందని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని , కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ గబ్బిలాల పేటలో నూతనంగా నిర్మాణమైన ఇందిరమ్మ ఇళ్ళను జిల్లా కార్యదర్శి కల్లేపల్లి సదానంద , ఏ ఈ శ్రీహరి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సారథ్యంలో జవహర్ నగర్ లో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ళు వచ్చాయని, లబ్ధిదారులు ఇళ్ళు పూర్తయినందుకు సంతోషంగా ఉన్నారని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తకొండ వేణు, నాయకులు అజయ్ కుమార్, సోమేశ్ చారి , మబ్బు అంజయ్య , శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని అడిగితే అక్రమ అరెస్టులా..?

**- మాజీసర్పంచ్ ల అరెస్ట్ పై బగ్గుమన్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య.**
**- అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే,వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని మాజీసర్పంచ్ ల ఆవేదన.**

**జనం వాయిస్, చిగురు మామిడి జూన్..01:**
గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీసర్పంచ్ లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ ల్లో నిర్బంధాలకు గురి చేయడం దారుణమని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెల్లవారుజామునే చిగురుమామిడి సర్పంచుల ఫోరం మాజీమండల అధ్యక్షుడు జక్కుల రవీందర్ ను,మాజీ సర్పంచ్ బోయిని శ్రీనివాస్,బెజ్జంకి లక్ష్మణ్, ముప్పిడి నరసింహారెడ్డి తదితర గ్రామాలకు చెందిన మాజీసర్పంచులను అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. తమ పదవి కాలంలో గ్రామ అభివృద్ధి కోసం అప్పులు తెచ్చి అనేక అభివృద్ధి పనులు చేపట్టి పనులు పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని శాంతియుతంగా నిరసనకు వెళుతున్న సర్పంచులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో సర్పంచ్ ల ఉద్యమాన్ని అనచలేరని,న్యాయబద్ధంగా వారికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామని హామీలు ఇచ్చి,గెలిచి గద్దెనెక్కాక...మాజీసర్పంచులు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసిన స్పందించకపోవడం బాధాకరం అని అన్నారు.మాజీసర్పంచుల పదవీకాలం పూర్తయి దాదాపు 32నెలలు పూర్తయినప్పటికీ పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, ఇది సరైన పద్ధతి కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మాజీమండల అధ్యక్షుడు జక్కుల రవీందర్ మాట్లాడుతూ అప్పులు చేసి మరీ గ్రామాల్లో పనులు పూర్తి చేశామని,ప్రభుత్వం బిల్లులు ఇవ్వక పోవడంతో వడ్డీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే తమ పెండింగ్ బిల్లును విడుదల చేయాలని కోరారు.



# అదనపు లారీలను ఐకెపి సెంటర్కు పంపించాలి

**రైస్ మిల్లుల వద్ద దిగుమతిని వేగవంతం పెంచాలి.**
**జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఈరవేన్ను గ్రామంలో రైతులతో ఐకెపి సెంటర్ వద్ద పలు సమస్యలు పరిష్కరించాలని సొసైటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన రైతులు.**

**జూన్ 1 జనం వాయిస్ పాలకుర్తి:**
రైస్ మిల్లుల వద్ద దిగుమతిని వేగం వేగవంతం చేసి అదనపు లారీలను ఐకెపి సెంటర్లకు పంపించాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎదునూరి మదార్ అన్నారు. పాలకుర్తి మండలం గ్రామంలో ఈరవెన్ను రైతులతో కలిసి సొసైటీ చైర్మన్ గోనె మైసి రెడ్డి మరియు సీఈ ఓరణధీర్ గార్లను కలిసి లారీల కొరత బాగా ఉందని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకుపోయరులిఈ సందర్భంగా మదార్ మాట్లాడుతూ లారీల కొరత బాగా ఉందని ప్రైవేట్ ట్రాక్టర్లతో రైతులు మిల్లుల వద్దకు పోయినప్పటికీ ధాన్యం మిల్లుల వద్ద దిగుమతి కాకి కూడా మిల్లుల వద్ద దిగుమతి గాక రైతులు పడిగాపులు పడుతూ భారం రైతుల మీద పడుతుందని అని అన్నారులి రైతులు వ్యవసాయ పనులు పక్కన పెట్టి కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినారు ఐకెపి కేంద్రంలో ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో రైతులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఈ సందర్భంగా సంఘ చైర్మన్ పై సమస్యలను కలెక్టర్ గారు దృష్టికి మరియు అధికారుల దృష్టికి తీసుకపోతానని వారు తెలిపారులిఈ కార్యక్రమంలో దూదేకుల యాకమ్మ అనుముల నరసయ్య అనుమల ఎల్లయ్య జక్కుల రాజు సింగిరెడ్డి ఉపేందర్ పొన్నాల దామోదర్ కోస రాజయ్య ముసుగు అనీలు దామెర రాజయ్య సింగిరెడ్డి సామి అనుమల కుమార్ పలు రైతులు పాల్గొన్నారు



# నర్సింగరావుకు ఆటో కార్మికుల ఘన సన్మానం

**మేడ్చల్, జూన్ 1(జనం వాయిస్):-**
మేడ్చల్ అంబేద్కర్ ఆటో స్టాండ్ ఆటో యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో నర్సింగరావును ఘనంగా సన్మానించారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటో డ్రైవర్లు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎర్ర విజయరావు మాట్లాడుతూ, నర్సింగరావు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల ఆదరణ పొందుతున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఆదివాసు రాజేష్, నరేష్, ముదిరాజ్, కొమ్మురాజు, షఫీ భాయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొని నర్సింగరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు నిర్వహించారు. ఆటో కార్మికుల ఐక్యతను ప్రతిబింబించేలా జరిగిన ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది. పాల్గొన్న వారంతా నర్సింగరావు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.



# చెన్నూరు రిజర్వాయర్ పాలకుర్తి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే యశస్విని

**పాలకుర్తి, జూన్ 01 జనం వాయిస్:**
జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు రిజర్వాయర్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లి ఈ సందర్భంగా రిజర్వాయర్ పనుల నాణ్యత వేగం ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను మరింత వేగవంతం చేయాలని ముఖ్యంగా రైతులకు సాగునీటి అవసరాలు స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యాలు సమయానికి అందే విధంగా ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం సమయానికి పూర్తవ్వాలని, పనుల విషయంలో రాజీ పడబోమని రిజర్వాయర్ పూర్తి అయితే పరిసర గ్రామాల రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అలాగే పనుల నాణ్యత విషయంలో ఎటువంటి లోపాలు ఉండకూడదని అధికారులు తరచూ పర్యవేక్షణ నిర్వహించాలని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే యశస్విని అన్నారు.



# ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశాలు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారులు..**

**జనం వాయిస్, అక్కన్నపేట, జూన్.01:**
ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో మంజూరైనటువంటి ఇండ్లను పంతులు తండా గ్రామ సర్పంచ్ చిన్న నాయక్ రిబ్బన్ కట్ చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిన్నా నాయక్, ఉపసర్పంచ్ సునీత శ్రీనివాస్ నాయక్, వార్డు మెంబర్లు రజిత రాజేందర్, సునీత సంపత్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవి నాయక్, లేవుడియా తిరుపతి, మాలోతు రాజు, కరంటోత్ తిరుపతి, లావుడ్య తిరుపతి, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి గ్రామ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఇదే కాకుండా త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం 2వ విడత ఇందిరమ్మ ఇండ్లను మన పంతులు తండాలో ఉన్నటువంటి ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇండ్ల మంజూరు చేపించి, రేవంతన్న సర్కారు ఇచ్చేటువంటి పథకాలు ప్రతీ గడప గడపకి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు అందిస్తామని తెలిపారు.



# చిగురుమామిడిలో 30వేల క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం సేకరణ.

- రెండు నెలల పాటు సాగిన సెంటర్.
- విక్రయించిన ధాన్యానికి డబ్బులు రాక రైతుల ఇబ్బందులు.

**జనం వాయిస్. చిగురుమామిడి మండలం.01:**
/చిగురుమామిడి:మండలంలోని 17గ్రామాల నుండి రబి సీజన్ లో మొక్కజొన్న రైతుల నుండి 30వేల క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర 2400రూపాయలతో సేకరించినట్లు మార్క్ ఫెడ్ సెంటర్ నిర్వాహకులు రాగుల శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దాదాపు 750మంది రైతుల నుండి మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మార్క్ఫెడ్ సెంటర్ ద్వారా రెండు నెలలపాటు రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని సేకరించినట్లు చెప్పారు. చిగురుమామిడి మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మూసి వేసామని రైతులు గమనించాలని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కొనుగోలు సెంటర్ విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన రైతులకు, హమాలీలకు, అధికారులకు శ్రీకాంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

**రెండు నెలలుగా ఖాతాలో డబ్బులు పడక రైతుల ఇబ్బందులు**
కొనుగోల్లు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో మొక్కజొన్న విక్రయించిన డబ్బులు పడకపోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. డబ్బుల చెల్లింపు కోసం రైతులు దీనంగా బ్యాంకుల వైపు చూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో విక్రయించిన డబ్బులు సొమ్మును జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు.

**ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ కొంకట మౌనిక.**

**జనం వాయిస్.చిగురు మామిడి జూన్.01:**
చిగురుమామిడి:కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో బొమ్మనపల్లి గ్రామానికి మరిన్ని ఎక్కువ మొత్తంలో ఇండ్లు మంజూరు అయ్యేలా చూస్తామని సర్పంచ్ కొంకట మౌనిక చక్రధరి తెలిపారు. సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు భోజ మానస మల్లేశం, మాచమల్ల అఖిల కిరణ్ లు గృహప్రవేశం చేయగా సర్పంచ్ కొంకట మౌనిక ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రెండో విడతలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు వచ్చే విధంగా కృషి చేస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసుకోని, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, 12వ వార్డ్ సభ్యులు బదుకోలు దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మాచమల్ల రమణయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి మడమడకల రాజిరెడ్డి, వార్డ్ సభ్యులు సుకోషి పద్మ, కొంకట బిక్షపతి, అందె సంపత్, మల్లిఖార్జున్ రెడ్డి, మాచమల్ల కిషోర్, మామిడి చంద్రమౌళి, భోజ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రేమించాడు.. పెళ్లికి మాత్రం నో..!

**- ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి మౌన పోరాటం.**

**మహబూబాబాద్, జూన్ 1 (జనం వాయిస్) :**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి గ్రామంలో ప్రేమ వ్యవహారం పెళ్లి విషయానికి వచ్చేసరికి వివాదంగా మారి, ఓ యువతి ప్రియుడి ఇంటి ముందు మౌన పోరాటానికి దిగిన ఘటన సోమవారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన భైరబోయిన మనీషా తెలిపిన వివరాల ప్రకారం, అదే గ్రామానికి చెందిన జూల వంశీతో గత రెండేళ్లుగా ప్రేమ సంబంధం కొనసాగిందని పేర్కొంది. ఈ సమయంలో తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి సన్నిహితంగా ఉన్నాడని, అయితే ఇటీవల పెళ్లి విషయాన్ని ప్రస్తావించగా వంశీ నిరాకరిస్తున్నాడని ఆరోపించింది. ప్రేమించిన సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పుడు విస్మరించి తనను మోసం చేస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేసిన మనీషా, సోమవారం నేరుగా వంశీ ఇంటి వద్దకు చేరుకుని మౌన దీక్ష చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి వెళ్లబోనని స్పష్టం చేసింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎస్సై రాజ్‌కుమార్ యువతితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చట్టపరంగా విచారణ చేపట్టి, ఎవరికీ అన్యాయం జరగకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇచ్చారు. దీంతో యువతి తన మౌన పోరాటాన్ని తాత్కాలికంగా విరమించినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై గ్రామంలో, బంధువుల మధ్య చర్చలు కొనసాగుతుండగా, ఈ ప్రేమకథకు ఎలాంటి ముగింపు లభిస్తుందనే ఉత్కంఠ స్థానికంగా నెలకొంది.



# ఘనంగా మార్గదర్శి కాలేజీ బి. ఎడ్ 2012-13 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం



**జనం వాయిస్, మహబూబాబాద్, జూన్ 01:**
మార్గదర్శి బి.ఎడ్ కళాశాల 201213 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రస్తుతం తాము చేస్తున్న ఉద్యోగాలు, సాధించిన విజయాలు, జీవితంలో ఎదిగిన విధానం గురించి తమ తోటి విద్యార్థులు మరియు అధ్యాపకులతో పంచుకున్నారు. కళాశాల రోజుల్లో ఏర్పడిన స్నేహబంధాలు, ఉపాధ్యాయుల నుంచి నేర్చుకున్న బోధనా విధానాలను ప్రస్తుతం తాము పనిచేస్తున్న పాఠశాలలు మరియు ఇతర రంగాల్లో ఎలా అమలు చేస్తున్నారో వివరించారు. పూర్వ విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులుగా, సామాజిక సేవకులుగా, ప్రైవేట్ రంగ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో స్థిరపడటం పట్ల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. తాము బోధించిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడం ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ గారు మాట్లాడుతూ, "13 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులను మళ్లీ కలవడం ఎంతో సంతోషంగా ఉంది. అందరూ మంచి స్థాయిలో స్థిరపడటం గర్వకారణం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ గారు, అధ్యాపకులు విజయ్, చంద్రశేఖర్, బాలాజీ గార్లు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం అవసరం

**ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి.**

**బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి.**

**ఇబ్రహీంపట్నం, జూన్ 1, (జనం వాయిస్ ):**
ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. మంచిగా ఉన్నతంగా చదివి వృద్ధిలోకి రావాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. డ్రగ్స్ అంతమే బీఆర్ఆర్ ఫౌండేషన్ యొక్క లక్ష్యమని అన్నారు. ప్రజలకు సేవా చేయాడమే తమ లక్ష్యమని అన్నారు. గ్రామంలో నీటి సమస్య ఉందని తెలిసినా వెంటనే వాటర్ ఫిల్టర్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కాగా బీఆర్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవల పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శోభ కుమార్, ఉపసర్పంచ్ రాజు, వార్డు సభ్యులు పద్మ ఐలయ్య, ఫౌండేషన్ సభ్యులు పున్నం రాము, మహమ్మద్ సద్దాం, ఆశ్వల బాలరాజ్, సాయి గౌడ్, భాను గౌడ్, డ్వాక్రా సంఘాల వీ ఓ లు రుద్ర, అనితా, స్రవంతి, ప్రమీల, జ్యోతి, సంతోష, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

**ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం.**
**ముకునూరు సర్పంచ్ సన్నాయిల శిల్పా ప్రేమాకర్.**

**ఇబ్రహీంపట్నం, జూన్ 1 (జనం వాయిస్):**
ఇందిరమ్మ రాజ్యంలోనే ఇందిరమ్మ ఇండ్లు ప్రజల ఇంటింట సౌభాగ్యాన్ని అందిస్తుందని ముకునూరు గ్రామ సర్పంచ్ సన్నాయిల శిల్పా ప్రేమాకర్ స్పష్టం చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ముకునూరు గ్రామంలో హుస్నానజ్మీన్, ఇస్మాయిల్ ఖాన్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశానికి గ్రామ సర్పంచ్ సన్నాయిల శిల్ప ప్రేమాకర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలు మెచ్చి, ఆశీర్వదించిన ప్రజా ప్రభుత్వంలోనే ప్రజలందరూ సంతోషంగా ఉంటున్నారని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాటను అమలుచేస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రజలు ఎల్లప్పుడూ సేవ చేసే నేతలకు, ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసే వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ రానున్న ఎన్నికల్లో కూడ ఆశీర్వదించాలని కోరారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలు తీర్చే వారినే ప్రజాప్రతినిధులు అంటారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల కళ్ళల్లో ఆనందం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామానికి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాడమళ్ళ పావని, పంచాయతీ కార్యదర్శి ఎ.వీణా, వార్డు సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులకు అవార్డులు

**ఇబ్రహీంపట్నం, జూన్ 1, (జనం వాయిస్):**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన అధికారులను గుర్తిస్తూ "ఉత్తమ సేవా పథకం" మరియు "సేవా పథకం" అవార్డులకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) కె.పి.వి.రాజు ఉత్తమ సేవా పథకానికి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. మహేందర్ రెడ్డి సేవా పథకానికి ఎంపికయ్యారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజా శాంతి భద్రతల పరిరక్షణలో చూపిన ప్రతిభ, కేసుల దర్యాప్తులో ప్రదర్శించిన సమర్థతను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ గౌరవాలను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు అవార్డు గ్రహీతలను అభినందించి, భవిష్యత్తులోనూ ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

RNI NO:TGTEL/26/A0383
దైనిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM




## ‘అచ్చియమ్మ’ పాత్రలో జాన్వీ సందడి.

### హీరోల తరహాలోనే ఎంట్రీ సీన్ ఉంటుందట..!

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘పెద్ది’ విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ భారీ స్పోర్ట్స్ డ్రామా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై భారీ ఆసక్తిని నెలకొల్పగా, తాజాగా కథానాయిక జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి.

సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్వీ కపూర్ తన పాత్రకు సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ చిత్రంలో ఆమె ‘అచ్చియమ్మ’ అనే గ్రామీణ యువతి పాత్రలో కనిపించనుంది. అయితే సాధారణంగా సినిమాల్లో చూపించే అమాయకమైన పల్లెటూరి యువతి పాత్రలకు భిన్నంగా ఈ పాత్ర ఉంటుందని తెలిపింది.

‘అచ్చియమ్మ’ తన నిర్ణయాలను తానే తీసుకునే ధైర్యవంతురాలని, తన చుట్టూ ఉన్న వారిపై ప్రభావం చూపే వ్యక్తిత్వం కలిగిన యువతిగా కనిపిస్తుందని జాన్వీ వివరించింది. కొంత ఆధిపత్యం, ఆత్మవిశ్వాసం కలిగిన పాత్రగా ఆమెను దర్శకుడు తీర్చిదిద్దారని చెప్పింది. కథలో ఈ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని, ప్రేక్షకులను ఆకట్టుకునే అనేక విశేషాలు ఉన్నాయని వెల్లడించింది.

అంతేకాకుండా తన ప్రవేశ సన్నివేశం గురించి కూడా జాన్వీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దర్శకుడు బుచ్చిబాబు తన పాత్రను ఎంతో ప్రత్యేకంగా రూపకల్పన చేశారని పేర్కొంది. సాధారణంగా స్టార్ హీరోలకు ఇచ్చే భారీ ఎలివేషన్లు, శక్తివంతమైన పరిచయ సన్నివేశాలు ఎలా ఉంటాయో, అదే స్థాయిలో ‘అచ్చియమ్మ’ పాత్ర ప్రవేశాన్ని రూపొందించారని తెలిపింది. ఈ సన్నివేశం థియేటర్లలో ప్రేక్షకుల నుంచి విశేష స్పందన అందుకుంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది.

హీరోయిన్ పాత్రకు ఇలాంటి ప్రత్యేక ఎలివేషన్ ఇవ్వడం చాలా అరుదని, అందుకే ఈ పాత్ర తనకు ఎంతో ప్రత్యేకమైందని జాన్వీ పేర్కొంది. చిత్రీకరణ సమయంలో గ్రామీణ భాష, హావభావాలు, పాత్ర స్వభావం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించింది.

ఇక ఈ చిత్రంలో రామ్‌చరణ్ పూర్తిగా కొత్త అవతారంలో కనిపించనున్నారు. గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే ఈ కథలో ఆయన మాస్, రస్టిక్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటుందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార సామగ్రికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.

ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. భారీ అంచనాల మధ్య విడుదల కానున్న ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని నమోదు చేస్తుందో చూడాలి.

## జపాన్ ట్రిప్‌లో మిస్టరీ వ్యక్తి..

### మళ్లీ వైరల్‌గా మారిన రష్మిక ఫొటోలు..!



స్టార్ నటి రష్మిక మందన్న మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ప్రతిష్టాత్మక యానిమే అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, అనంతరం తన జపాన్ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంది. అయితే ఈ ఫొటోలు కేవలం ఆమె అందం లేదా జపాన్ అందాల వల్లే కాకుండా, అందులో కనిపించిన ఓ మిస్టరీ వ్యక్తి కారణంగా కూడా వైరల్ అవుతున్నాయి. తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో జపాన్ పర్యటనకు సంబంధించిన పలు చిత్రాలు, వీడియోలను పంచుకున్న రష్మిక, “ఈ ఏడాది జపాన్ ట్రిప్ మరింత ప్రత్యేకంగా, సరదాగా సాగింది” అంటూ వ్యాఖ్య జత చేసింది. ఈ ఫొటోల్లో ఆమె జపాన్ వీధుల్లో విహరిస్తూ, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను ఆస్వాదిస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ పర్యటనలో రష్మిక ధరించిన సంప్రదాయ జపనీస్ దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యుకాటా అనే సాంప్రదాయ వస్త్రధారణలో ఆమె ఎంతో అందంగా కనిపించింది. రంగురంగుల పూల నమూనాలతో అలంకరించిన ఆ దుస్తులకు తగినట్లుగా చేసిన అలంకరణ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. జపాన్ సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ రూపానికి నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఫొటోలతో పాటు పంచుకున్న వీడియోల్లో రష్మిక తన చిలిపి స్వభావాన్ని మరోసారి ప్రదర్శించింది. జపాన్‌లోని పర్యాటక ప్రాంతాల్లో సరదాగా గడిపిన క్షణాలను అభిమానులతో పంచుకోవడంతో ఆ వీడియోలు కూడా మంచి ఆదరణ పొందుతున్నాయి. ఆమె నవ్వులు, అల్లరి చేష్టలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

అయితే ఈ ఫొటోల్లో ఎక్కువ చర్చకు కారణమైన అంశం ఒకటి ఉంది. కొన్ని చిత్రాల్లో ఓ వ్యక్తి కనిపించినప్పటికీ, అతని ముఖం స్పష్టంగా కనిపించకుండా జాగ్రత్త పడినట్లు నెటిజన్లు గుర్తించారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో వెంటనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఆ వ్యక్తి ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండేనని అభిమానులు భావిస్తూ కామెంట్లు చేస్తున్నారు. అయితే దీనిపై రష్మిక గానీ, విజయ్ దేవరకొండ గానీ ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. అయినప్పటికీ “ముఖం కనిపించకపోయినా ఎవరో మాకు తెలుసు” అంటూ అభిమానులు సరదాగా స్పందిస్తున్నారు.

ప్రస్తుతం జపాన్ ట్రిప్‌కు సంబంధించిన అందమైన దృశ్యాల కంటే, అందులో కనిపించిన ఆ మిస్టరీ వ్యక్తిపైనే సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ చర్చ జరుగుతోంది. రష్మిక పంచుకున్న ఈ ఫొటోలు మరోసారి అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించాయి.

## మోడ్రన్ లుక్‌లోనూ మెరిసిన ఐశ్వర్య మీనన్



దక్షిణ భారత సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ఐశ్వర్య మీనన్ మరోసారి సోషల్ మీడియాలో ఆకర్షణగా నిలిచింది. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో పలు చిత్రాల్లో నటించిన ఆమె, తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

తమిళ చిత్రాలతో సినీ ప్రయాణం ప్రారంభించిన ఐశ్వర్య మీనన్, అనంతరం పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. తెలుగు ప్రేక్షకులకు ఆమె నిఖిల్ సిద్ధార్థ్ సరసన నటించిన ‘స్పై’ చిత్రంతో పరిచయమైంది. ఆ చిత్రంలో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారిణి పాత్రలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. తరువాత ‘భజే వాయు వేగం’ చిత్రంలోనూ కీలక పాత్ర పోషించి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమాల కంటే సోషల్ మీడియా వేదికల ద్వారా అభిమానులతో నిరంతరం మమేకమవుతున్న ఐశ్వర్య మీనన్, ఎప్పటికప్పుడు కొత్త ఫోటోషూట్లను పంచుకుంటూ ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె చీరలో సంప్రదాయ అందాలను ప్రదర్శించగా, మరోవైపు ఆధునిక దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ఫోటోలను చూసిన అభిమానులు ఆమె అందానికి ప్రశంసలు కురిపిస్తున్నారు. సంప్రదాయం, ఆధునికత రెండింటినీ సమపాళ్లలో మేళవిస్తూ ఐశ్వర్య మీనన్ తనదైన శైలిలో ఆకట్టుకుంటోందని సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఆమె కొత్త చిత్రాల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. మంచి కథలు, బలమైన పాత్రలతో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం.

## ‘మగధీర’ సెట్స్‌లో చరణ్ అల్లరి..

### ఆసక్తికర విషయం చెప్పిన కాజల్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, నటి కాజల్ అగర్వాల్ జంటగా నటించిన ‘మగధీర’ చిత్రం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకుని అనేక రికార్డులు సృష్టించింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ సమయంలో జరిగిన సరదా సంఘటనలను కాజల్ అగర్వాల్ అభిమానులతో పంచుకున్నారు.

ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన కాజల్, ‘మగధీర’ చిత్రీకరణ రోజుల్లో రామ్ చరణ్ తనను సరదాగా ఆటపట్టించేవాడని గుర్తు చేసుకున్నారు. సినిమాలో గుర్రపు స్వారీ సన్నివేశాలు కీలకంగా ఉండటంతో రామ్ చరణ్ తన సొంత గుర్రం ‘బదల్’ను చిత్రీకరణకు తీసుకువచ్చేవాడని తెలిపారు. చిత్రీకరణ విరామ సమయంలో తనను ఆ గుర్రంపై కూర్చోబెట్టి తిప్పేవాడని, అనంతరం అదే గుర్రం పేరును పదేపదే పిలుస్తూ సరదాగా అల్లరి చేసేవాడని కాజల్ వెల్లడించారు. తాను ఎక్కడ కనిపించినా “బదల్... బదల్...” అంటూ గట్టిగా పిలిచి అందరినీ నవ్వించేవాడని చెప్పారు. ఆ రోజుల జ్ఞాపకాలు ఇప్పటికీ తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తాయని, రామ్ చరణ్ చేసిన సరదా చేష్టలు మరచిపోలేనివని కాజల్ పేర్కొన్నారు. ‘మగధీర’ చిత్రీకరణ సమయంలో ఏర్పడిన అనుబంధం ఇప్పటికీ తన మనసులో నిలిచిపోయిందని తెలిపారు. ఇదిలా ఉండగా, రామ్ చరణ్ ప్రస్తుతం తన తాజా చిత్రం ‘పెద్ది’ ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినీ అభిమానులు ఈ సినిమాపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com